మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 223 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnag Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad

మంగళవారం 22 అక్టోబర్ 2024

## ఎపి మహిళలకు చంద్రబాబు దీపావళి కానుక

**31నుంచి ఉచిత సిలిండర్ల పంపిణీకి ఆమోదం**

**ఏడాదికి మూడు సిలిండర్లు ఇచ్చేందుకు నిర్ణయం**





అమరావతి,అక్టోబర్21 (ప్రజా మంటలు): ఏపీలో మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం అమలుకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. దీపావళి కానుకగా ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని ప్రారంభించనున్నారు. ఈ నెల 31వ తేదీ నుంచి ఉచితంగా ఏడాదికి మూడు సిలిండర్లు ఇస్తామని మిగతా 2లో..

## గ్రూప్-1 పరీక్షల్లో జోక్యం చేసుకోలేం

**మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు సుప్రీం నిరాకరణ**

**యధాతథంగా గ్రూప్ పరీక్షల నిర్వహణ**



హైదరాబాద్, (ప్రజా మంటలు): తెలంగాణ గ్రూప్-1 అభ్యర్థుల పిటిషన్‌పై జోక్యం చేసుకునేందుకు, మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. హైకోర్టు తన మధ్యంతర ఉత్తర్వుల్లో అన్ని అంశాలూ స్పష్టంగా చెప్పిందని సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం తెలిపింది. అభ్యర్థులు పరీక్షా కేంద్రాల్లో ఉన్నప్పుడు జోక్యం చేసుకోవడం సరికాదని పేర్కొంది. ఫలితాల విడుదలకు మిగతా 2లో..

## దేశ భద్రత, ప్రజల రక్షణలో పోలీసుల పాత్ర ఎనలేనిది

### అమరపోలీసులకు నివాళి అర్పించిన సిఎం రేవంత్ రెడ్డి

**ప్రజలు ప్రశాంతంగా ఉంటున్నారంటే పోలీసులే కారణం**

**రాష్ట్ర అభివృద్ధిలోనూ పోలీసులదే కీలక బాధ్యత**

**శాంతిభద్రతలతోనే రాష్ట్రానికి పెట్టుబడి అవకాశాలు**

**అమరులైన పోలీస్ కుటుంబాలను ఆదుకుంటాం**

**మరణించిన పోలీస్ కుటుంబాలకు 2కోట్ల వరకు సాయం**



హైదరాబాద్, (ప్రజా మంటలు): శాంతి భద్రతలు, నిఘా విషయంలో తెలంగాణ పోలీసుల పాత్ర కీలకమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశ భద్రత, ప్రజల రక్షణలో పోలీసుల పాత్ర ఎనలేనిదన్నారు. అమరులైన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. విధి నిర్వహణలో మరణించిన అధికారులను గుర్తు చేసుకోవడం అందరికీ స్ఫూర్తిదాయకమని




చెప్పారు. అమరులైన కానిస్టేబుల్, ఏఎస్సై కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్ లోని గోషామహల్ స్టేడియంలో నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. విధి నిర్వహణలో అసువులు బాసి అమరులైన పోలీసులకు సీఎం నివాళులర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ ప్రసంగిస్తూ.. అమరులైన పోలీస్ అధికారులందరికీ ప్రభుత్వం తరపున ఘన నివాళులర్పించారు. 140 కోట్ల దేశ జనాభా ప్రశాంతంగా ఉంటున్నారంటే అందుకు పోలీసులే కారణమన్నారు. రాష్ట్రం అభివృద్ధి పదంవైపు నడవాలంటే పోలీసులు కీలకమన్నారు. నిరుద్యోగుల సమస్య, శాంతి భద్రత లేని రాష్ట్రం ఉంటే పెట్టుబడులు రావని.. రాష్ట్రం అభివృద్ధికి పోలీసులు నిరంతరం శ్రమిస్తున్నందుకు అభినందనలు తెలియజేశారు. అమరులైన పోలీస్ అధికారుల కుటుంబాలను ప్రభుత్వం మిగతా 2లో..



## మంచిరేవులలో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ శంకుస్థాపన చేసిన సిఎం రేవంత్ రెడ్డి

రంగారెడ్డి,అక్టోబర్21(ప్రజా మంటలు): రంగారెడ్డి జిల్లా మంచిరేవులలో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ భవనానికి సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలతో పోలీసుల పిల్లలకు ఇక్కడ విద్య అందించనున్నారు. పోలీసులు, ఎక్సైజ్, ్౯÷ర్, ఎస్పీఎఫ్ ఉద్యోగుల పిల్లలు ఇక్కడ విద్యనభ్యసించనున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ జితేందర్ తదితరులు పాల్గొన్నారు. పోలీసుల సంక్షేమం కోసం ఆలోచించింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ నేపథ్యంలోనే యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌కు శంకుస్థాపన చేశామన్నారు. 2014లో రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటూ గత ప్రభుత్వం పార్టీ కోసం పోలీసులను ఉపయోగించుకుంది తప్ప.. ప్రజా సంక్షేమం కోసం కాదని విమర్శించారు. ఒక్క రోజు కూడా సెలవు తీసుకోకుండా పని చేస్తున్న పోలీసులకు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో యువత శ్రేయస్సు కోసం మొదటిగా యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసుకున్నామన్నారు.

'విద్యార్థుల్లో కులమతాల భేదం ఉండకూడదని అన్ని నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా స్కూల్స్ ఏర్పాటు దిశగా ముందుకెళ్తున్నాం. పోలీసుల పిల్లలు అంతర్జాతీయ స్థాయిలో ఎదిగేలా నాణ్యమైన విద్యను అందించేందుకు యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నాం. గత ప్రభుత్వం 10 ఏళ్లలో చేసిందేమీ లేదు. తెలంగాణ వచ్చాక గ్రూప్-1 మెయిన్స్ నిర్వహిస్తున్నాం. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు 10 నెలలుగా ఓ విజన్‌తో ముందుకెళ్తున్నాం' అని శ్రీధర్‌బాబు తెలిపారు.



## దీక్ష విరమించిన పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్

**లద్దాఖ్‌కు రాష్ట్ర హోదా తదితర అంశాలపై చర్చ**

**నేరుగా కలిసి సమస్యలు తెలుసుకున్న హోంశాఖ అధికారులు**

2లో..



## పోలీస్ రిక్రూట్‌మెంట్‌ను వేగంగా పూర్తి చేయండి

**డిజిపికి చేతులు జోడించి విన్నవించిన బీహార్ సిఎం**

పట్నా,అక్టోబర్21(ప్రజా మంటలు): బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ పాల్గొన్న ఓ కార్యక్రమంలో నాటకీయ మిగతా 2లో..

## పత్తి రైతులను మోసం చేస్తే చర్యలు

**ప్రైవేటు వ్యాపారులకు మంత్రి తుమ్మల హెచ్చరిక**

**ఖమ్మం జిల్లాలో పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభించిన మంత్రి**



ఖమ్మం,అక్టోబర్21 (ప్రజా మంటలు): పత్తి రైతులను మోసం చేసే ప్రైవేటు వ్యాపారులపై చర్యలు తప్పవని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు హెచ్చరించారు. రైతులకు ఇబ్బంది లేకుంగా రెవెన్యూ మార్కెటింగ్ అధికారులు దగ్గరుండి చూడాలని అన్నారు. గుర్రాలపాడులో పత్తి కొనుగోలు కేంద్రాన్ని మిగతా 2లో..

## మనదేశంలో ఓ మాదరిగా.. వారి దేశంలో మరోమాదిరి

**అందుకే దైత్యవేత్తలను కెనడా నుంచి రప్పించాం**

**కెనడా తీరుపై అసమనం వ్యక్తం చేసిన మంత్రి జైశంకర్**

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): భారత దౌత్యవేత్తలపై కెనడా ప్రభుత్వ చర్యలతో ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు క్షీణించిన క్రమంలో..తాజా పరిణామాలపై భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ స్పందించారు. పోలీసు విచారణలో భారత హైకమిషనర్ పాల్గొనాలని కెనడా కోరిందని.. అందుకే మన హైకమిషనర్‌తో పాటు దౌత్యవేత్తలను వెనక్కి పిలిపించామని చెప్పారు. ఓ జాతీయ మిగతా 2లో..



## మూసీపై పూటకో మాట మాట్లాడుతున్న సీఎం రేవంత్

**మరోమారు విమర్శలు గుప్పించిన హరీశ్ రావు**


మిగతా 2లో..

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు



ముంబై,అక్టోబర్21(ప్రజా మంటలు): దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు తీవ్ర ఊగిస లాటకు లోనయి చివరికి నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల సంకేతాలతో నేటి ట్రేడింగ్ ఉత్సాహంగా ప్రారంభ మయి మిగతా 2లో..

## ప్రజా నాడి




## తప్పుడు ధ్రువపత్రాలతో భూమి పట్టా చేసుకున్నవైనం!

- హనుమకొండ జిల్లా ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఆదేశాలతో అప్పటి తహసిల్దార్ తో సహా 10 మందిపై కేసు నమోదు
- ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ లో పేరు గల్లంతు
- వివరాలు వెల్లడించిన సామల వనమాల




భీమదేవరపల్లి అక్టోబర్ 21 (ప్రజామంటలు) : తప్పుడు ధృవపత్రాలతో ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్ సృష్టించి కుటుంబ సభ్యులకు తెలియకుండా భూమి పట్టా చేసుకున్న వ్యక్తితో పాటు మరో 9 మంది పై కేసు నమోదయింది. భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన సామల మల్లాచారి (రిటైర్డ్ ఏ.ఆర్ ఎస్ఐ) పేరున సర్వే నంబర్ 559అ/3 లో 0-33 గుంటలు, 558ఆ/5 లో 0-21 గుంటల వ్యవసాయ భూమి ఉంది. కాగా మల్లాచారి భారతి దంపతులకు ఇద్దరు కుమారులు రాజ్ కుమార్, సతీష్ ఉన్నారు. భారతి చనిపోవడంతో మల్లాచారి వనమాలను రెండో వివాహం చేసుకున్నాడు. కాగా నవంబర్ 2022 లో మల్లాచారి మరణించాడు. అనంతరం సామల సతీష్ కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రములో వనమాల పేరు చేర్చకుండా, సోదరుడు రాజ్ కుమార్ కు తెలియకుండా మంగ 33 గుంటల భూమిని విరాసత్ పేరా పట్టా చేసుకున్నాడు. ఈ విషయంపై బాధితురాలు సామల వనమాల కోర్టును ఆశ్రయించగా అప్పుడు భీమదేవరపల్లి డిప్యూటీ తహశీల్దార్, తహశీల్దార్ శివ కుమార్ బాధ్యతల్లో ఉండి నిబంధనలు పాటించకుండా కుటుంబ ధ్రువీకరణ పత్రం జారీ చేసినట్టు వెల్లడైంది. ఈ కేసులో అక్రమంగా పట్టా చేసుకున్న సామల సతీష్ తో పాటు సాక్షులుగా ప్రభుత్వ ఉద్యోగులు ఎండీ రఫీ, బత్తిని తిరుపతి, కొత్తపల్లి గ్రామస్తులు అయిన సట్ల సతీష్, సల్పాల సురేందర్, రేణికుంట్ల రాజు, కొత్తగట్టు రజనీ కాంత్, సర్టిఫికెట్ జారీ చేసిన తహశీల్దార్ శివకుమార్ పై కేసు నమోదు చేసి విచారణ చేపట్టాలని, హనుమకొండ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ మల్కనూర్ ఎస్ఐని ఆదేశించగా అక్టోబర్ 14 న, వారిపై కేసు నమోదు చేయడం జరిగిందని సామల వనమల తెలిపారు.

## పాలిట్రిక్స్

నిఘా నీడలో పరీక్ష
గ్రూప్ వన్ మెయిన్స్ ,
కసరత్తులో సర్కారు
పెడుతుంది ఫుల్ సెన్స్ !
మూడు సార్లు ఫ్లాప్
ప్రిలిమ్స్ తో పాట్లు ,
గట్టెక్కినా ఇంటర్వ్యూకు
తెరుచుకుని గేట్లు ?

- న్యాలకంటి నారాయణ
9346200066

మొదటి పేజీ తరువాయి

## ఎపి మహిళలకు చంద్రబాబు దీపావళి కానుక

చంద్రబాబు ప్రకటించారు. దీపం పథకం కింద ఈ ఉచిత గ్యాస్ సిలిండర్లను మహిళలకు అందిస్తామని తెలిపారు. దీనికోసం ఏడాదికి రూ.2948 కోట్లు ఖర్చు చేయనున్నట్లు పేర్కొన్నారు. దీపం పథకం అమలు, విధివిధానాలపై ఏపీ సీఎం చంద్రబాబు సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. మహిళల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అందుకే రాష్ట్రంలో ఆర్థిక సమస్యలు ఉన్నప్పటికీ.. పేదలకు మేలు చేసే సంక్షేమ పథకాల విషయంలో ముందడుగు వేస్తున్నామని తెలిపారు. ఈ నెల 31వ తేదీ నుంచి దీపావళి పథకం ప్రారంభించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ పథకం కింద ఎల్‌పీజీ గ్యాస్ కనెక్షన్ కలిగి ఉండి.. అన్ని అర్హతలు కలిగిన ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిం దర్లు అందిస్తామని పేర్కొన్నారు. ప్రతి నాలుగు నెలల వ్యవధిలో ఎప్పుడైనా ఆయా లబ్దిదారులు ఒక ఉచిత గ్యాస్ సిలిండర్ పొందే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. ఈ క్రమంలో ఈ నెల 24 నుంచి సిలిండర్ కోసం బుకింగ్ చేసుకునేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు.

## పత్తి రైతులను మోసం చేస్తే చర్యలు

మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడారు. తెలంగాణ వ్యాప్తంగా 40 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారని తెలియజేశారు. వాతావరణ పరిస్థితుల దృష్టా ఈ సారి పత్తి దిగుబడి తగ్గిందని, ఖమ్మం జిల్లాలో 17 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేశామన్నారు. ఖమ్మం జిల్లాల్లో తొమ్మిది సిసిఐ కొనుగోలు కేంద్రాలు ద్వారా పత్తి కొనుగోలు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. రైతులు సంప్రదాయ పంటలు నుంచి ఉద్యాన పంటల వైపు మళ్లాలన్నారు. పత్తి, మిర్చి స్థానంలో పామాయిల్ సాగు చేస్తే అధిక లాభం వస్తుందని, రైతులకు గిట్టుబాటు ధర అందించాలనేదే తమ ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు. రైతులు నాణ్యమైన పత్తి తెచ్చి గరిష్ఠ ధర పొందాలని మంత్రి కొండా సురేఖ సూచించారు. ఎనుమాముల మార్కెట్‌లో పత్తి కొనుగోలు కేంద్రాన్ని మంత్రి కొండా సురేఖ ప్రారంభించారు. ఎనుమాముల మార్కెట్‌కు వచ్చిన ప్రతి పత్తి బస్తాను కొనుగోలు చేస్తామని సురేఖ స్పష్టం చేశారు. ఎనుమాముల మార్కెట్ కు తెల్ల బంగారం పోటెత్తింది. వరంగల్ ఎనుమాముల మార్కెట్‌లో క్వింటాల్ పతి ధర రూ. 7521గా ఉంది. రాష్ట్రవ్యాప్తంగా 40 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం జిల్లాలోని గుర్రాలపాడులో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఈసారి పత్తి దిగుబడి తగ్గిందన్నారు. ఖమ్మం జిల్లాలో 17 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. జిల్లాలో 9 సీసీఐ కొనుగోలు కేంద్రాల ద్వారా పత్తి కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. 'రైతులకు ఇబ్బంది లేకుండా రెవెన్యూ,మార్కెటింగ్ అధికారులే చూడాలన్నారు. అన్నదాతలను మోసం చేసే ప్రైవేటు వ్యాపారులపై చర్యలు తప్పవు. రైతులు సంప్రదాయ పంటల నుంచి ఉద్యాన పంటల వైపు మళ్లాలి. పత్తి, మిర్చి స్థానంలో పామాయిల్ సాగు చేస్తే అధిక లాభం. పంటలకు గిట్టుబాటు ధర అందించాలనేదే మా ప్రభుత్వ సంకల్పం' అని తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఇదిలావుంటే వరంగల్‌లోని ఎనుమాముల మార్కెట్‌లో పత్తి కొనుగోలు కేంద్రాన్ని మంత్రి కొండా సురేఖ ప్రారంభించారు. రైతులు నాణ్యమైన పత్తి తెచ్చి గరిష్ట ధర పొందాలని ఆమె సూచించారు. మార్కెట్‌కు వచ్చిన ప్రతి బస్తా కొనుగోలు చేస్తామని తెలిపారు.

## మనదేశంలో ఓ మాదరిగా.. వారి దేశంలో మరోమాదిరి

### అందుకే దైత్యవేత్తలను కెనడా నుంచి రప్పించాం

కెనడా తీరుపై అసమనం వ్యక్తం చేసిన మంత్రి జైశంకర్ వార్తా ఛానెల్ నిర్వహించిన సదస్సులో పాల్గొన్న ఆయన.. ఆ దేశంతో సంబంధాలను ప్రస్తుతం అంచనా వేయడం కష్టమేనన్నారు. 'పోలీసు విచారణలో భారత హైకమిషనర్ పాల్గొనాలని కెనడా కోరింది. అందుకే మన హైకమిషనర్‌తోపాటు దౌత్యవేత్తలను ఉపసంహరించుకోవడాన్ని ఎంచుకున్నాం. దౌత్యవేత్తల సంక్షేమం, భద్రతకు సంబంధించి కెనడాలో ఏం జరుగుతుందనే విషయాలను తెలుసుకోవడం కెనడాకు ఇబ్బంది కరంగా మారినట్లు కనిపిస్తోంది. అదే భారత్‌లో.. కెనడా దౌత్యవేత్తలు మాత్రం మన సైన్యం, పోలీసుల సమాచారాన్ని స్వేచ్ఛగా సేకరించడం, నిర్దేశిత పౌరులను కెనడాలో అడ్డుకునేందుకు మాత్రం ఎటువంటి చర్యలుండవు ' అని కెనడా తీరుపై జైశంకర్ మండిపడ్డారు. 'అక్కడా, ఇక్కడా వారి తీరు భిన్నంగా ఉంది. భారత్‌కు చెందిన నేతలు, దౌత్యవేత్తలను మీ పౌరులు బహిరంగంగా బెదిరిస్తున్నారు అని మనం చెబితే.. వాక్ స్వాతంత్య్రం అంటారు. భారత హైకమిషనర్‌ను బెదిరించినా భావ ప్రకటనా స్వేచ్ఛ కింద పరిగణించాలని అంటున్నారు. అదే భారత్‌లోని కెనడా దౌత్యవేత్త సౌత్‌బ్లాక్ నుంచి కోపంతో బయటకు వచ్చారని ఓ భారత జర్నలిస్టు పేర్కొంటే మాత్రం.. విదేశీ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. ఇదీ మారుతున్న ప్రపంచంలో చోటుచేసుకుంటున్న పరిస్థితులు' అని కెనడాను ఉద్దేశిస్తూ భారత విదేశాంగ మంత్రి చురకలు అంటించారు. 1945 తర్వాత ప్రపంచంపై పాశ్చాత్య దేశాల ప్రభావం ఎక్కువగా ఉండేదన్న జైశంకర్.. గడిచిన 20-25 ఏళ్లలో పరిస్థితుల్లో మార్పు వచ్చిందన్నారు. పాశ్చాత్యేతర దేశాల వాటా, భాగస్వామ్యం, ప్రభావం పెరిగిందని.. ఈ నేపథ్యంలో వివాదాలు, ఘర్షణలు, వాదనలు సహజమేనన్నారు. ఈ క్రమంలో కొన్ని దేశాల మధ్య సంబంధాలు అంత సాఫీగా ఉండవని విదేశాంగ మంత్రి అంచనా వేశారు.

## దీక్ష విరమించిన పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్

### లద్దాఖ్‌కు రాష్ట్ర హోదా తదితర అంశాలపై చర్చ

### నేరుగా కలిసి సమస్యలు తెలుసుకున్న హోంశాఖ అధికారులు

న్యూఢిల్లీ,(ప్రజా మంటలు): పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్ , ఆయన అనుచరులు నిరాహార దీక్షను విరమించారు. లద్దాఖ్‌కు రాష్ట్ర హోదా, ఆరో షెడ్యూల్‌లో చేర్చాలన్న డిమాండ్లపై కేంద్ర హోంమంత్రిత్వ శాఖ అధికారులు ఆయన్ను కలిసి తమ ప్రతిపాదనలు ఉంచారు. అనంతరం ఆయనకు నిమ్మరసం అందజేసి దీక్షను విరమింపజేశారు. డిసెంబర్ 3న లేహ్ ఎపెక్స్ బాడీ, కార్గిల్ డెమొక్రటిక్ అలయెన్స్ (కేడీఏ) ప్రతినిధులతో చర్చలు జరిపేందుకు కేంద్ర హోంశాఖ అంగీకరించడంపై వాంగ్‌చుక్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'కేంద్ర హోంశాఖ అధికారులు, లద్దాఖ్ జాయింట్ సెక్రటరీ వచ్చి డిసెంబర్ 3న చర్చలకు సంబంధించిన లేఖ అందజేశారు. ఇదివరకు నిలిచిపోయిన చర్చలు డిసెంబర్ 3న కొనసాగుతాయి. మా ప్రధాన డిమాండ్ నెరవేరింది. ఇరువర్గాల నుంచి నిజాయతీగా, సానుకూలంగా చర్చలు జరుగుతాయని భావిస్తున్నాం'అని ఆశాభావం వ్యక్తం చేశారు. లద్దాఖ్‌ను రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్‌లో చేర్చాలన్న డిమాండ్‌తో లేహ్ ఎపెక్స్ బాడీ (ఎల్ఏబీ), కార్గిల్ డెమొక్రటిక్ అలయెన్స్ (కేడీఏ) నేతృత్వంలో గత నెల 1న లేహ్ నుంచి సోనమ్ వాంగ్‌చుక్ 'దిల్లీ చలో' పాదయాత్రను చేపట్టారు. దీంతో పోలీసులు దిల్లీ సరిహద్దుల్లోనే అడ్డుకొని వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం జంతర్ మంతర్‌వద్ద దీక్ష కోసం వారు అనుమతి కోరగా పోలీసులు నిరాకరించడంతో.. ప్రత్యామ్నాయం లేక చివరకు తాను బస చేసిన లద్దాఖ్ భవన్ వద్దే అక్టోబర్ 6న దాదాపు 18మందితో కలిసి నిరాహార దీక్షకు దిగారు. లద్దాఖ్‌ను రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్‌లో చేరిస్తే స్థానిక జనాభా, వారి భూమి, సాంస్కృతిక గుర్తింపును రక్షించేందుకు చట్టాన్ని రూపొందించే అధికారాన్ని ఇస్తుంది.

## పోలీస్ రిక్రూట్‌మెంట్‌ను వేగంగా పూర్తి చేయండి

సన్నివేశం చోటుచేసుకుంది. రాష్ట్రంలో పోలీస్ రిక్రూట్‌మెంట్‌ను వేగంగా పూర్తి చేయాలంటూ డీజీపీ అలోక్‌రాజ్‌ను సీఎం చేతులు జోడించి అభ్యర్థించడంతో అంతా షాక్ అయ్యారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. కొత్తగా ఎంపికైన 1,239 మంది పోలీస్ అధికారులకు నియామక పత్రాలు అందజేత కార్యక్రమంలో ఈ ఘటన జరిగింది. ఈ సందర్భంగా సీఎం నీతీశ్ ప్రసంగిస్తూ మధ్యలో ఆగి డీజీపీ వైపు చూస్తూ.. 'త్వరగా రిక్రూట్‌మెంట్ జరిగేలా చూస్తారా?' అని చేతులు జోడించి అడిగారు. దీంతో షాకైన డీజీపీ.. ఆయనకు సెల్యూట్ చేశారు. మైక్ వద్దకు వెళ్లి మాట్లాడుతూ.. సీఎం ఆదేశాలు అమలు చేసేందుకు పోలీసులు కట్టుబడి ఉన్నారన్నారు. త్వరితగతిన రిక్రూట్‌మెంట్ పూర్తి చేసి.. పటిష్టమైన శిక్షణ అందిస్తామన్నారు. దీంతో సీఎం ఆయనకు థాంక్స్ చెప్పారు. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ బిహార్‌లో శాంతి భద్రతలపై ప్రతిపక్షాలు తీవ్రస్థాయిలో ఆరోపణలు గుప్పిస్తున్న తరుణంలో సీఎం ఈ విధంగా వ్యాఖ్యానించడం చర్చనీయాంశంగా మారింది.

## మూసీపై పూటకో మాట మాట్లాడుతున్న సీఎం రేవంత్

### మరోమారు విమర్శలు గుప్పించిన హరీశ్ రావు



హైదరాబాద్, (ప్రజా మంటలు): మూసీపై పూటకో మాట మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌంటర్ ఇచ్చారు. పలు సందర్భాల్లో.. పలు వేదికల్లో మూసీపై సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలను హరీశ్‌రావు గుర్తు చేశారు. మూసీ పరివాహక అభివృద్ధి కోసం ఐదేండ్లలో రూ. లక్షా 50 వేల కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేసినట్లు జులై 20వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు.

సెప్టెంబర్ 6న సీఎం చేతుల మీదుగా విడుదల చేసిన 'తెలంగాణ గ్రోత్ స్టోరీ ద రోడ్ టు వన్ ట్రిలియన్ డాలర్ ఎకానమీ' విజన్ డాక్యుమెంట్‌లోనూ.. రూ. లక్షా 50వేల కోట్లు అంటే సుమారు 18 బిలియన్ల డాలర్లతో ఐదేండ్లలో మూసీ రివర్ ఫ్రంట్ రీడెవలప్‌మెంట్ కొరకు ఖర్చు చేస్తున్నట్లుగా పేర్కొన్నారని హరీశ్‌రావు గుర్తు చేశారు. మొన్న ప్రెస్ మీట్‌లో మాట్లాడుతూ రూ. లక్షా 50 వేల కోట్లు ఎవరన్నారంటూ రేవంత్ ఆవేశంతో ఊగిపోయారు. పూటకో తీరుగా మాట్లాడుతున్న మిమ్మల్ని చూసి ఊసరవెల్లి కూడా సిగ్గు పడుతుంది. బిడ్డ పుట్టక ముందే కుల్ల కుట్టినట్లు డీపీఆర్ లేకుండా రూ. లక్షా 50వేల కోట్లు ఖర్చువుతాయని చెప్పడం కాంగ్రెస్ ప్రభుత్వానికే చెల్లుతుంది. మూసీ రిజువినేషన్ అండ్ రివర్ ఫ్రంట్ పేరుతో ప్రజాధనం లూటీ చేయాలనే మీ కుట్రలను బట్టబయలు చేస్తాం. మీ నిరంకుశ విధానాలను అడుగడుగునా ఎండగడతాం. తెలంగాణ ప్రజల తరుపున నిలదీస్తామని సీఎం రేవంత్ రెడ్డిని హరీశ్‌రావు హెచ్చరించారు.




## గ్రూప్-1 పరీక్షల్లో జోక్యం చేసుకోలేం

### మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు సుప్రీం నిరాకరణ

### యధాతథంగా గ్రూప్ పరీక్షల నిర్వహణ

ముందే తుది విచారణ ముగించాలని హైకోర్టుకు సూచించింది. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 29 రద్దు చేయాలని కోరుతూ గ్రూప్-1 అభ్యర్థులు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తీర్పు వచ్చే వరకు పరీక్షలు వాయిదా వేయాలని కోరారు. జీవో 55నే అమలు చేయాలని కోరినా సీఎం పట్టించుకోవడం లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. దివ్యాంగుల రిజర్వేషన్లకు సంబంధించి 2022లో జారీ చేసిన జీవో 55కు సవరణ తీసుకొస్తూ ఫిబ్రవరి 8న జారీ చేసిన జీవో 29ని రద్దు చేయాలని గ్రూప్-1 అభ్యర్థులు కోరుతున్నారు. జనరల్ కేటగిరీలోని అభ్యర్థుల కంటే ఎక్కువ మార్కులు సాధించిన వారిని అన్‌రిజర్వుడుగానే పరిగణిస్తుండటం వల్ల దివ్యాంగ అభ్యర్థులకు అన్యాయం జరుగుతోందన్నారు. వారికంటే ఎక్కువ మార్కులు వచ్చినా.. రిజర్వేషన్ కేటగిరీగానే పరిగణించి 1:50 కింద అభ్యర్థులను మెయిన్స్‌కు పిలవాలని కోరుతున్నారు. దివ్యాంగుల రిజర్వేషన్లకు సంబంధించిన వివాదం నేపథ్యంలో గ్రూప్-1 పరీక్షలు నిలిపివేయాలని కొందరు అభ్యర్థులు కోరగా.. హైకోర్టు నిరాకరించింది. నోటిఫికేషన్ రద్దు చేయాలన్న అభ్యర్థనను తిరస్కరించిన ఉన్నత న్యాయస్థానం.. నియామకాలు తుది తీర్పునకు లోబడి ఉంటాయని విచారణ వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో గ్రూప్-1 అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీంతో సోమవారం నుంచి జరగాల్సిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు లైన్ క్లియర్ అయింది. మరికొద్ది గంటల్లో పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ప్రస్తుత దశలో పరీక్షల నిర్వహణలో తాము జోక్యం చేసుకోలేమని తెలిపింది. మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు న్యాయస్థానం నిరాకరించింది. ఈనెల 27వ తేదీ వరకు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలని టీజీపీఎస్సీ షెడ్యూల్ విడుదల చేసింది. పరీక్షల వాయిదాకు నిరాకరిస్తూ పిటిషన్‌ను తిరస్కరించడంతో దీంతో తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. తెలంగాణలో గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షల కోసం టీజీపీఎస్సీ పూర్తి ఏర్పాట్లు చేసింది. అక్టోబర్ 21 నుంచి 27వ తేదీ వరకు మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు 31,383 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో 46 పరీక్షా కేంద్రాల ఏర్పాటు చేశారు. హైదరాబాద్ జిల్లాలో 8, రంగారెడ్డి జిల్లాలో 11, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 27 పరీక్ష కేంద్రాలను టీజీపీఎస్సీ ఏర్పాటుచేసింది. అన్ని కేంద్రాల వద్ద ఏవిధమైన అవకతవకలు, అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పోలీసు శాఖ తెలిపింది. పరీక్షల నిర్వహణను జిల్లా కలెక్టర్లు పర్యవేక్షిస్తారు. 2011 తర్వాత గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు జరుగుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారి ఈ పరీక్షలను నిర్వహిస్తున్నారు. గతంలో నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ అనివార్య కారణాలతో వాయిదాపడుతూ వచ్చింది. దీంతో ఎలాంటి లోపాలు లేకుండా పరీక్షల నిర్వహణకు టీజీపీఎస్సీ ఏర్పాట్లు చేసింది. ప్రతి పరీక్ష హాల్, చీఫ్ సూపరింటెండెంట్ రూమ్, పరిసర ప్రాంతాలన్నింటిలోనూ సీసీ టీవీలను ఏర్పాటు చేసింది. టీజీపీఎస్సీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ద్వారా సీసీ టీవీలను పర్యవేక్షించనుంది. పరీక్షల నిర్వహణలో ప్రతి షిఫ్ట్‌లో కచ్చితమైన నియమ నిబంధనలు పాటించేలా స్పష్టమైన మార్గదర్శకాలను అధికారులు జారీచేశారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల బయోమెట్రిక్ హాజరు తీసుకునేందుకై ప్రత్యేక సిబ్బందిని నియమించారు.

## నష్టాల్లో ముగిసిన స్టాక్ట మార్కెట్లు



నప్పటికీ చివరికి నష్టాల్లో ముగిసింది. ఎన్ఎస్ఈలో బజాజ్ ఆటో, హెచ్ డిఎఫ్ సి బ్యాంక్, ఏసియన్ పెయింట్, ఎం అండ్ ఎం, ఐషర్ మోటర్స్ షేర్లు ప్రధానంగా లాభపడగా, టాటా కన్జ్యూమర్, కొటక్ బ్యాంక్, బజాజ్ ఫిన్సర్వ్, బిపిసిఎల్, ఇండస్ ఇండ్ బ్యాంక్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. నేడు సెన్సెక్స్ 73.48 పాయింట్లు లేక 0.09 శాతం నష్టపోయి 81151.27 వద్ద ముగిసింది, ఇక నిఫ్టీ 72.96 పాయింట్లు లేక 0.29 శాతం నష్టపోయి 24781.10 వద్ద ముగిసింది. ఇక 2902 స్టాకులు ట్రేడవ్వగా, 695 లాభపడ్డాయి, 2120 నష్టపోయాయి, 87 మార్పు లేకుండా ముగిశాయి.



## దేశ భద్రత, ప్రజల రక్షణలో పోలీసుల పాత్ర ఎనలేనిది

ఆదుకుంటుందని స్పష్టం చేశారు. అమరులైన ఎస్సై, సీఐ కుటుంబాలకు రూ.కోటి 25 లక్షలు.. డీఎస్పీ, ఏఎస్పీ కుటుంబాలకు రూ.కోటి 50 లక్షలు.. ఎస్పీ, ఐపీఎస్ కుటుంబాలకు రూ.2 కోట్ల పరిహారం ఇస్తామన్నారు. శాశ్వత అంగవైకల్యం పొందిన పోలీసులకు పరిహారం ఇస్తామని ప్రకటించారు. 'పోలీసు సిబ్బంది పట్ల నాకు ప్రత్యేక అభిమానం ఉంది. పోలీసులు, వారి కుటుంబాలు ఆత్మగౌరవంతో జీవించాలి. ఎవరి ముందో చేయి చాచే పరిస్థితి తెచ్చుకోవ ద్దని కోరుతున్నానని అన్నారు. విమర్శలకు అవకాశం ఇవ్వొద్దని కోరుతున్నా. విధి నిర్వహణలో పోలీసులకు ఎలాంటి లోటు లేకుండా చర్యలు తీసుకుంటాం. వారి ఖర్చులు, ఇతర ఏర్పాట్లకు నిధులు కేటాయిస్తాం. నేరగాళ్లు సరికొత్త విధానాలతో ముందుకొస్తున్నారు. పెరుగుతున్న ఆధునిక సాంకేతికత ద్వారా నేరాలు చేస్తున్నారని హెచ్చరించారు. తెలంగాణ పోలీసుల విధానాలను ఇతర రాష్ట్రాలు పాటిస్తున్నాయి. మన ఫోరెన్సిక్ ల్యాబ్ అనేక రాష్ట్రలకు ఆదర్శంగా నిలుస్తోంది. మన సైబర్ క్రైమ్ విభాగం దేశంలోనే గొప్పదని కేంద్ర హోంశాఖ అభినందించింది. ఇవాళ డ్రగ్స్ మహమ్మారి యువతను పట్టిపీడిస్తోంది. డ్రగ్స్ వల్ల పంజాబ్ అనేక కష్టాలు ఎదుర్కొంటోంది. మాదకద్రవ్యాల వినియోగం రాష్ట్రంలో క్రమంగా పెరుగుతోంది. వీటి నివారణకు రాష్ట్రంలో టీజీన్యాబ్‌ను ఏర్పాటు చేశాం. ఏఐ పరిజ్ఞానంతో ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించేవారిని గుర్తిస్తున్నాం. నేరస్థులను కఠినంగా శిక్షించేందుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. శాంతిభద్రతలను చేతుల్లోకి తీసుకోవద్దని ప్రజలను కోరుతున్నాం. వివిధ పండుగలు ప్రశాంతంగా జరుపుకోవడంలో పోలీసుల సేవలు మరచిపోలేము. జీతం కోసం వారు పనిచేయడం లేదని అన్నారు. బాధ్యతాయుతంగా భావించి సేవలు అందిస్తున్నారు' అని రేవంత్‌రెడ్డి తెలిపారు. తీవ్రవాదులు, మావోయిస్టు చేతుల్లో మరణించిన అధికారులను స్మరించుకోవడం అందరికి స్ఫూర్తిదాయకమన్నారు. సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయని.. డ్రగ్స్ మహమ్మారి యువతపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు.దేశానికే తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నామన్నారు. మందిరాల మీద, మజీద్‌ల మీద దాడులు చేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఇటీవల ముత్యాలమ్మ గుడిపై దాడి చేసిన వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. శాంతి భద్రతలు తమ చేతిల్లోకి తీసుకునే వారి పట్ల కఠినంగా ఉండాలని తెలిపారు. వివిధ పండుగలు ప్రశాంతంగా జరుకోవడంలో పోలీస్ సేవలు మరచిపోలేమని కొనియాడారు. జీతం కోసం పోలీస్ సిబ్బంది పనిచేయడం లేదని.. బాధ్యతాయుతంగా భావించి పోలీసులు సేవలు అందిస్తున్నారన్నారు. క్రిమినల్స్‌తో పోలీసులు ఫ్రెండ్లీగా ఉండడం కాదని.. బాధితులతో ఫ్రెండ్లీగా ఉండాలని సూచించారు. క్రిమినల్స్ విషయంలో పోలీసులు కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. పోలీస్ కుటుంబాల కోసం యంగ్ ఇండియా స్కూల్‌ను ఈరోజు ప్రారంభిస్తున్నామన్నారు. 50 ఎకరాల విస్తీర్ణంలో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తున్నామని.. ఈరోజు పునాది వేస్తున్నామన్నారు. వచ్చే అకాడమీ నుంచి విద్యా సంస్థ ప్రారంభిస్తామని చెప్పారు. నేరగాళ్ల పట్ల కఠినంగా వ్యవహారించాలని స్పష్టం చేశారు. 'పోలీస్ సమస్యలు ఏమున్నా నా దగ్గరికి తీసుకువస్తే నేను పరిష్కరిస్తాను' అని తెలిపారు. వీర మరణం పొందిన పోలీస్ కుటుంబాలకు ఇక నుంచి కోటి రూపాయలు నష్ట పరిహారం అందజేయనున్నట్లు ప్రకటించారు. కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్‌కు కోటి రూపాయలు, సబ్ ఇన్‌స్పెక్టర్, ఇన్‌స్పెక్టర్‌లకు కోటి 25 లక్షలు, డీఎస్పీ, అడిషనల్ ఎస్పీ, ఎస్పీలకు కోటి 50 లక్షలు, ఐపీఎస్ కుటుంబాలకు 2 కోట్లు ఇస్తామని.. అలాగే శాశ్వతంగా అంగవైకల్యం పొందిన కుటుంబాలకు కూడా నష్ట పరిహారం చెల్లిస్తామని స్పష్టం చేశారు. ఇంతే కాకుండా చనిపోయిన కుటుంబ సభ్యులలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు.

దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమర వీరులను స్మరించుకోవడం మన బాధ్యత అని డీజీపీ జితేందర్ అన్నారు. దేశ వ్యాప్తంగా ఈ ఏడాది మొత్తం 214 మంది పోలీసులు అమరులు అయ్యారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఒక పోలీస్ అధికారి ప్రాణాలు కోల్పోయారన్నారు. ప్రవీణ్ అనే కానిస్టేబుల్ అమరుడు అయ్యారని.. వారి కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించిందని చెప్పారు. తెలంగాణ పోలీస్ శాఖ శాంతి భద్రతల విషయంలో ఎక్కడ రాజీపడడం లేదని స్పష్టం చేశారు. సైబర్ సెక్యూరిటీ వింగ్ ఏర్పాటు.. వాటికి కావాల్సిన సౌకర్యాలు అన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. సైబర్ నేరాలను అరికట్టడంలో తెలంగాణ పోలీస్ శాఖ ముందు వరుసలో ఉందని డీజీపీ జితేందర్ పేర్కొన్నారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమర వీరులను స్మరించుకోవడం మన బాధ్యత అని డీజీపీ జితేందర్ అన్నారు. దేశ వ్యాప్తంగా ఈ ఏడాది 214 మంది పోలీసులు అమరులయ్యారని చెప్పారు. తెలంగాణ రాష్టం నుంచి ఒక పోలీసు అధికారి ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. సైబర్ నేరాలను అరికట్టడంలో తెలంగాణ పోలీసు శాఖ ముందు వరుసలో ఉందని వివరించారు.

# రైతుబంధు ఎగిరిపోయింది

**రాబందుల రెక్కల చప్పుడు మిగిలింది**

**ఎక్స్ వేదికగా కెటిఆర్ విమర్శలు**



హైదరాబాద్, (ప్రజా మంటలు):
అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ చేసిన నినాదం గుర్తుందా అంటూ ఎక్స్ వేదికగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతుబంధు రాదని తామన్నామని, ఇప్పుడు అదే అక్షర సత్యం అయిందని విమర్శించారు. ఎకరానికి రూ. 15 వేలు ఇస్తామన్నవారు, రూ. 10 వేలకే ఎగనామం పెట్టారని పేర్కొన్నారు. 'రైతుబంధు కావాలా..? రాబందు కావాలా..? ఎన్నికల ముందు బీఆర్ఎస్ ఇచ్చిన నినాదం గుర్తుందా..? రైతుబంధు ఎగిరిపోయింది..రాబందుల రెక్కల చప్పుడే మిగిలింది! నమ్మి నానబోస్తే పుచ్చి బుర్రలైనట్టుంది పరిస్థితి..! ఎకరానికి రూ. 15వేలు ఇస్తామని ఊదరగొట్టి..ఉన్న పదివేలు ఊడగొట్టారు..! పంట పెట్టుబడి ఎగ్గొట్టడం అంటే..అన్నదాత వెన్ను విరవడమే..! రైతు ద్రోహి కాంగ్రెస్..చరిత్ర నిండా అనేక రుజువులు..ఇప్పుడు ఇంకొకటి ! రైతు ద్రోహి సీఎం రేవంత్ రెడ్డిని వదిలేదే లేదు' అని కేటీఆర్ తన ఎక్స్ పోస్ట్ లో విమర్శలు గుప్పించారు. రైతు భరోసా నిబంధనలంటూ కమిటీలు వేస్తూ కాలయాపన చేస్తున్నారని బీఆర్ఎస్ విమర్శించింది. ఆదివారం వివిధ జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ శ్రేణులు నిరసనలు తెలిపాయి. ఈ మేరకు ఆ పార్టీ ఇవాళ ఎక్స్ లో చేసిన ఓ పోస్ట్ ను కేటీఆర్ రీపోస్ట్ చేశారు. 'రైతులకు మద్దతుగా జిల్లా, మండల కేంద్రాల్లో ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణులు రాస్తారోకోలు, ధర్నాలు చేశారు. రైతులకు ద్రోహం చేసిన రేవంత్, ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేసి..
వ్యతిరేక నినాదాలతో హోరెత్తించారు. రేవంత్ సర్కారు హామీలను అమలు చేయకుండా అన్నదాతలను నయవంచనకు గురిచేసింది. ఇప్పటికే రుణమాఫీ విషయంలో కర్షకులను వంచించిన కాంగ్రెస్ సర్కారు ఇప్పుడు రైతు భరోసా విషయంలోనూ మరోసారి మోసం చేసింది. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి మోసాలు మరోసారి బయటపడ్డాయి. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం ఎకరానికి రూ. 15 వేల చొప్పున రైతు భరోసా ఇవ్వాల్సిందే. గడచిన వానకాలం రైతుభరోసా ఇవ్వబోమంటే ఊరుకోం. సబ్ కమిటీ నివేదిక వచ్చాకే యాసంగి సాయం అందిస్తామంటే సహించబోం' అని బీఆర్ఎస్ అధికారిక ఎక్స్ అకౌంట్లో పోస్ట్ చేసింది.

# మద్యం మత్తులో భార్యతో గొడవ

**గొంతు కోసం భార్యను హత్యచేసిన దుర్మార్గుడు**

విజయవాడ,అక్టోబర్21 (ప్రజా మంటలు):
మద్యం మత్తులో భార్యను హతమార్చాడో భర్త. ఈ ఘటన విజయవాడ టూ టౌన్ కొత్తపేట పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షేక్ నగీనా అనే మహిళ తన భర్త బాజీతో కలిసి కంసాలిపేటలో నివాసం ఉంటోంది. బాజీ పెయింటర్.. నగీనా ఓ సమోసాల తయారీ కేంద్రంలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. బాజీ మద్యానికి బానిసై రోజూ భార్యతో గొడవపడేవాడు. ఈ క్రమంలో మద్యం మత్తులో ఆమెతో వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలోనే కత్తితో నగీనా గొంతు కోసి హతమార్చాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు.. బాజీని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## కారు,బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి

మహబూబాబాద్,అక్టోబర్21(ప్రజా మంటలు):
మహబూబాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. కారు, బైక్ ఢీ కొన్న ఘటనలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ విషాదకర సంఘటన మహబూబాబాద్ మండలం జామాండ్లపల్లి శివారు ఫారెస్ట్ అర్బన్ పార్క్ వద్ద చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# ములుగు జిల్లాలో పలు అభివృద్ధి పనులు

**వెంకటాపూర్‌లో కంప్యూటర్ ల్యాబ్‌కు సీతక్క ప్రారంభం**



ములుగు,అక్టోబర్21 (ప్రజా మంటలు):
జిల్లాలో రాష్ట్ర మంత్రి సీతక్క విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. తొలుత వెంకటాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో (సీఎస్ఆర్ నిధులు, మౌరిటెక్ ఐటీ సంస్థ ఆధ్వర్యంలో) ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం గోవిందరావుపేట మండలం చల్వాయి నుంచి బుస్సాపూర్, లక్నవరం సరస్సు వరకు రూ. 3.60 కోట్ల నిధులతో రహదారి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా గోవిందరావుపేట మండల కేంద్రం నుంచి ఎల్బీ నగర్ మీదుగా దుంపల్లిగూడెం వరకు, బాలాజీనగర్ జడ్పీ క్రాస్ రోడ్డు నుంచి సంద్రగూడెం మీదుగా లక్ష్మీపూర్ వరకు, తాతయిపల్లి నుంచి పాపయ్యపల్లి మీదుగా మద్దులగూడెం వరకు రహదారి మరమ్మతు పనులను ప్రారంభించారు.

# మంత్రి చేయల్సిన పనులేనా ఇవి?

**రోడ్డెక్కి ధర్నాలు చేయడం సబబేనా**

**బండి సంజయ్‌పై కడియం ఘాటు విమర్శలు**



జనగామ,అక్టోబర్21(ప్రజా మంటలు):
కేంద్రమంత్రి అన్న ఇంగితం లేకుండా బండి సంజయ్ ఇష్టం వచ్చినట్లుగా రోడ్లపై ధర్నాలు చేయడమేమిటని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఘాటు వ్యాఖ్యలు చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడతూ.. బండి సంజయ్ కేంద్రమంత్రి అని మరిచిపోయి సిగ్గు లేకుండా నడిరోడ్లపై దాడులు చేస్తున్నారని.. జ్ఞానం ఉందా అంటూ విరుచుకుపడ్డారు. రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడి సమస్య పరిష్కరించే విధంగా కృషి చేయాల్సింది పోయి రోడ్డు మీద కూర్చోవడం పద్ధతేనా అని నిలదీశారు. తెలంగాణ అభివృద్ధిపై బీఆర్ఎస్‌కు, బీజేపీకి ప్రేమ లేదని.. అధికారం కోసం పోటీపడుతున్నారని విమర్శించారు. రేవంత్ రెడ్డి చక్కగా పరిపాలిస్తున్నారని అన్న ఎమ్మెల్యే.. ఆర్థికపరమైన ఇబ్బందులు ఉన్నాయని తెలిపారు. ఏడు లక్షల కోట్ల అప్పులలో రాష్ట్రం ఉందన్నారు. వడ్డీలు, జీతాలు, పెన్షన్లు, అభివృద్ధి కార్యక్రమాలకు మిగులుబాటు లేదని.. సర్దుబాటు చేసుకునే పరిస్థితి ఉందన్నారు. రేవంత్ రెడ్డి సంకల్పానికి మనందరం సపోర్టుగా నిలవాలన్నారు. ఆయన ధైర్యంగా ముందుకు వెళ్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ మాయమాటలు నమ్మితే నష్ట పోతామ న్నారు. బీఆర్ఎస్ మొసలి కన్నీరు కారుస్తోందని వ్యాఖ్యలు చేశారు. ఐదేండ్లలో కల్వకుంట్ల కుటుంబం దోపిడి చేసిందని ఆరోపించారు. 2014లో కేసీఆర్ కుటుంబం మొత్తం ఆస్తులు ఎంత.. ఇప్పుడు కేసీఆర్ ఆస్తులు ఎంత.. దమ్ముంటే ప్రజల ముందుకు చర్చకు రావాలని సవాల్ విసిరారు. హరీష్ రావు నిజాయితీ గురించి కేటీఆర్ మాట్లాడుతున్నారు సిగ్గుందా అంటూ మండిపడ్డారు. జనగామలో ప్రతాపరెడ్డి నాయకత్వంలో వచ్చే స్థానిక సంస్థల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలని ఆకాంక్షించారు. 10 ఏళ్లలో ఒక్క డీఎస్సీ నిర్వహించని బీఆర్ఎస్‌కు కాంగ్రెస్‌ను విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు అమాయకులైన నిరుద్యోగు లను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీలో హరీష్ రావు, కేటీఆర్‌లు.. బీజేపీ పార్టీలో కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఈటల రాజేందర్ ఒకరిపై ఒకరు పోటీ పడుతున్నారన్నారు. ప్రతిపక్షాలు కాంగ్రెస్ ప్రభుత్వంపై ముప్పేట దాడులు చేస్తున్నాయన్నారు. రేవంత్ రెడ్డి సంకల్పానికి ప్రతి ఒక్కరు అండగా నిలబడాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. శనివారంగ్రూప్-1 అభ్యర్థులు హైదరాబాద్ లో నిర్వహించిన చలో సచివాలయం ముట్టడి ర్యాలీలో బండి సంజయ్ పాల్గొన్నారు. దాదాపు నాలుగు గంటల పాటు ఉద్రిక్తత మధ్య జరిగిన ర్యాలీలో బండి సంజయ్‌ని పోలీసులు అదుపులో తీసుకొని.. బీజేపీ రాష్ట్ర కార్యాలయా నికి తరలించారు. జీవో నెంబర్ 29ని రద్దు చేసి జీవో నెం 55ను అమలు చేయాలంటూ నిరు ద్యోగులు ఆందోళన లకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. వీరి నిరసనకు బండి సంజయ్ మద్దతు తెలిపారు. బండి సంజయ్‌తో పాటు బీజేపీ శ్రేణులు పెద్దఎత్తున అశోక్‌నగర్ చేరుకుని ఆందోళన చేస్తున్న అభ్యర్థులకు మద్దతు తెలుపుతూ రోడ్డుపై బైఠాయించి నిరసనకు దిగారు. దీంతో వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని కేంద్రమంత్రిని అడ్డుకునేందుకు ప్రయత్నిం చారు. చివరకు తెలుగు తల్లి ÷÷-లఓల్గ÷వర్ వద్ద బండిసంజయ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం అక్కడి నుంచి బీజేపీ కార్యాలయానికి కేంద్రమంత్రిని తరలించారు.



# 24 గంటలు నాన్ స్టాఫ్ వరల్డ్ రికార్డ్ కవిసమ్మేళనం గల్ఫ్ గాయం పుస్తక ఆవిష్కరణ

తాడేపల్లిగూడెం అక్టోబర్ 21( ప్రజా మంటలు)
శ్రీశ్రీ కళావేదిక 24 గంటలు నాన్ స్టాప్ వరల్డ్ రికార్డ్ కవి సమ్మేళనము పాటల పోటీలు నాటికలు మొదలగు కార్యక్రమంలో కత్తిమండ ప్రతాప్ మరియు శ్రీ శ్రీ కళావేదిక జాతీయ కార్యదర్శి మరియు శ్రీశ్రీ కళావేదిక కన్వీనర్ రమా మేడం చేతులమీదుగా గల్ఫ్ గాయం ఆటో బయోగ్రఫీ డాక్టర్ షేక్ చాంద్ పాషా జీవిత చరిత్ర పుస్తకము వేదిక పైన వందలాది మంది కళాకారుల చేతుల మీదుగా ఆవిష్కరించబడినది. మరియు డాక్టర్ సయ్యద్ సమీనా పర్వీన్ ప్రభుత్వ ఉపాధ్యాయురాలు కవయిత్రి రచయిత్రి రాసిన ఇంద్రధనస్సు అనే పుస్తకము రకరకాల కవితలతో నిండి ఉన్న పుస్తకాన్ని శ్రీశ్రీ కళావేదిక పత్తిమండ ప్రతాప్ శ్రీశ్రీ కళావేదిక కోఆర్డినేటర్ గారు రమా మేడం చేతుల మీదుగా శ్రీశ్రీ కళావేదిక మీద పుస్తకం ఆవిష్కరణ జరిగినది మరియు నాన్ స్టాప్ 24 గంటలు వాల్ రికార్డ్ కవి సమ్మేళనంలో డాక్టర్ సయ్యద్ సమీనా పర్యం ప్రభుత్వ ఉపాధ్యాయురాలు కపయిత్రి రచయిత్రి కవిత గానము చేసి వరల్డ్ రికార్డ్ జ్ఞాపిక మరియు శాలువతో వందలాది కవుల సమక్షంలో సన్మానము జరిగినది. ఆమెను కవులు కళాకారులు ఉపాధ్యాయ బృందం అభినందించింది .వేదిక పైన పుస్తకాల పంపిణీ కూడా జరిగినది. గల్ఫ్ గాయం ఆటో బయోగ్రఫీ డాక్టర్ షేక్ చాంద్ పాషా ఎన్ఆర్ఐ సెల్ జగిత్యాల్ పుస్తకం మరియు ఇంద్రధనస్సు పుస్తకము డాక్టర్ సయ్యద్ సమీనా పర్వీన్ పుస్తకము ఇంద్రధనస్సు కూడా వేదిక పైన పంపిణీ చేయడం జరిగినది .ఈ కార్యక్రమము తాడేపల్లి గూడెం ఏలూరు పశ్చిమగోదావరి జిల్లాలో బుద్ధ కన్వెన్షనల్ హాలులో జరిగినది .పుస్తకాలను చదివి గల్ఫ్ గాయం మరియు ఇంద్రధనస్సు రకరకాల కవితలను చదివి గల్ఫ్ గాయం పుస్తకాన్ని చదివి కవులు కళాకారులు రచయితలు మేధావులు శ్రీశ్రీ కళావేదిక బాడీ మెంబర్స్ అందరూ అభినందించారు.



# జివో 29 వల్ల బిసిలకు అన్యాయం

**గవర్నర్‌కు నివేదించిన ఎమ్మెల్సీ మల్లన్న**

హైదరాబాద్, (ప్రజా మంటలు):
ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ కుమార్ బీసీ సంఘాలతో కలిసి గవర్నర్ ను కలిశారు. జీవో 29పై ఫిర్యాదు చేశారు. ఈ జీవో వల్ల బీసీలకు అన్యాయం జరుగుతుందన్నారు. జీవో 29 ప్రకారం పరీక్షలు నిర్వహించడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ పరీక్షలు ముందుకు వెళ్లేవి కాదని స్పష్టం చేశారు. దీనికి ఖచ్చితంగా అడ్డుకట్ట పడుతుందన్నారు. ఇబిసి రిజర్వేషన్లు అక్రమం అని.. గవర్నర్‌కు నివేదించామని మా నాయకడు రాహుల్ గాంధీ కులాలవారీగా జనాభాను బట్టి అవకాశాలు కల్పిస్తామని ఇప్పటికే ప్రకటించారన్నారు. ఖచ్చితంగా బీసీల రిజర్వేషన్లు, బీసీల హక్కులను కాలరాయడానికి ఎవరు ప్రయత్నించినా అది మా పార్టీ అయినా సరే వదిలి పెట్టబోమని ఆయన హెచ్చరించారు. తీన్మార్ మల్లన్న ఇటీవల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. అయితే ఆయన ఎప్పుడూ పార్టీ పాలసీని పట్టించుకోవడం లేదు. తన సొంత అభిప్రాయాల మేరకే రాజకీయం చేస్తున్నారు. తాజాగా జీవో 29 విషయంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అంతా ప్రభుత్వ విధానాన్ని సమర్థిస్తోంది. ఈ జీవో వల్ల ఎవరికీ అన్యాయం జరగదని పైగా.. బడుగు, బలహీన వర్గాలకే మేలు అని వాదిస్తున్నారు. కానీ తీన్మార్ మల్లన్న మాత్రం .. ఈ జీవో వల్ల బీసీలకు అన్యాయం జరుగుతుందని.. ఓ వర్గం వారికి ఉద్యోగాలు కల్పించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నారని ఆరోపిస్తున్నారని ఆరోపిస్తూ సొంత పార్టీ పై బీసీ సంఘాలతో కలిసి గవర్నర్‌కు ఫిర్యాదు చేయడం సంచలనంగా మారింది.

# దుర్గాప్రసాద్ హత్యకేసులో జోక్యం లేదు

**శ్రీకాంత్ అరెస్టుతో తనకు సంబంధం లేదన్న మంత్రి సుభాష్**



కోనసీమ,అక్టోబర్21
(ప్రజా మంటలు): దళిత యువకుడు, వాలంటీర్ జనుపల్లి దుర్గాప్రసాద్ హత్య కేసులో చట్టం తనపని తాను చేసుకుని పోతుందని మంత్రి వాసంశెట్టి సుభాశ్ అన్నారు. వైకాపా నేత, మాజీ మంత్రి పినిపె విశ్వరూప్ కుమారుడు శ్రీకాంత్‌ను ఏపీ పోలీసులు అరెస్ట్ చేసిన క్రమంలో ఆయన స్పందించారు. ఈ అరెస్టు వెనక తన ప్రోద్బలం లేదని మంత్రి వాసంశెట్టి మీడియా సమావేశంలో పేర్కొన్నారు. మాజీ మంత్రి, అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ సీపీ అధ్యక్షుడు విశ్వరూప్ చేసిన వ్యాఖ్యలను మంత్రి సుభాష్ ఖండించారు. 'విశ్వరూప్ కుమారుడి విషయంలో చట్టం తన పని తాను చేసుకు వెళుతుంది. ఎస్ఆర్‌సీపీ ప్రభుత్వంలో వాలంటీర్ దుర్గాప్రసాద్ హత్య కేసు మూసేశారు. కేసు పెట్టకుండా దుర్గాప్రసాద్ భార్యకు మాజీ మంత్రి విశ్వరూప్ రెండు ఎకరాలు ఇస్తానని ఇవ్వలేదు. న్యాయం చేయమని ఆమె నా వద్దకు వచ్చింది. బాధిత కుటుంబానికి న్యాయం చేసేందుకే నేను బాధితులను డీజీపీ, ఐజీల వద్దకు తీసుకెళ్లాను' అని అన్నారు. 'శ్రీకాంత్‌కు వాలంటీర్ దుర్గాప్రసాద్ ప్రధాన అనుచరుడుగా ఉండేవాడు. తన కుమారుడికి శ్రీకాంత్ అని పేరు పెట్టుకున్నాడు. రాజకీయ కక్ష సాధింపులు వద్దని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టంగా చెబుతున్నారు. ఆ మాట ప్రకారం మేము నడుచుకుంటున్నాం. కోనసీమ అల్లర్ల కేసులో నేను ఏ1 గా ఉన్నానని విశ్వరూప్ అవాస్తవాలు మాట్లాడారు. నా పేరును వైకాపా ప్రభుత్వం చేర్చింది' అని అన్నారు.

**మెడికలాఫీసర్స్ డాక్టర్ రెహమాన్, రూబీనా లచే**

# పాఠశాల విద్యార్థులకు క్యాన్సర్ పై అవగాహన

భీమదేవరపల్లి అక్టోబర్ 21 (ప్రజామంటలు) :
క్యాన్సర్ పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని వంగర మెడికలాఫీసర్స్ డాక్టర్ రెహమాన్, రుబీనా అన్నారు. సోమవారం భీమదేవరపల్లి మండల కేంద్రంలోని జడ్.పి.హెచ్.ఎస్ స్కూల్లో విద్యార్థులకు పొగాకు ఉత్పత్తుల వలన కలిగే నష్టాలను వివరిస్తూ నిషేధించాలన్నారు. క్యాన్సర్ తో ఎంతో మంది ప్రజలు చనిపోతున్నారన్నారని ఉన్నారు. ఈ విషయంపై విద్యార్థులకు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం ఏం స్వరూప, జి స్వరూప, కే రాణి,కే స్వరూప, స్కూల్ టీచర్స్ విద్యార్థులు పాల్గొన్నారు.



# ప్రత్యేక చట్టాలకు నోచుకోని ఆదివాసీలు

## అక్టోబర్ 22... కొమురం భీం జయంతి సందర్భంగా



రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

ఆదివాసీలపై నిజాం నవాబు సాగించిన దోపిడీకి వ్యతిరేకంగా, పాలక వర్గాల దౌర్జన్యాలను ప్రశ్నిస్తూ, గిరిజన హక్కుల కోసం 'జల్-జంగిల్-జమీన్' నినాదంతో మడమ తిప్పని పోరాటాలు చేసి, ప్రాణాలర్పించిన పోరాట యోధుడు కొమురం భీం.


గిరిజన గోండు తెగకు చెందిన కొమురం చిన్నూమ్, సోంబాయి దంపతులకు 1901 అక్టోబర్ 22న అవిభక్త ఆదిలాబాద్ జిల్లా, ఆసిఫాబాద్ తాలూకాలోని సంకేపల్లి గ్రామంలో జన్మించి, ఆసిఫాబాద్ పరిసర ప్రాంతాలు, జోడేఘాట్ గుట్టలు కేంద్రంగా నిజాం నవాబు పై గెరిల్లా పోరాటాన్ని కొనసాగించి, కుర్దు పటేల్ అనే నమ్మకద్రోహి ఇచ్చిన సమాచారంతో, అర్ధరాత్రి కొమరం స్థావరాలను సైన్యం చుట్టుముట్టగా జోడేఘాట్ అడవుల్లో 1940, అక్టోబర్ 27 న, అంటే ఆదివాసీలు పవిత్రంగా భావించే ఆశ్వీయుజ శుద్ధ పౌర్ణమి రోజున వీరమరణం పొందాడు భీం.

కొమురం భీం స్ఫూర్తితో...దేశంలో తమ హక్కుల సాధన కోసం ఆదివాసీ సమాజాలు ఉద్యమించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. బ్రిటిష్ చట్టాలకు వ్యతిరేకంగా బిర్సాముండా, సంతాల్‌లు,తిరుగుబాటు చేశారు. జల్, జంగల్, జమీన్ కోసం సాయుధ పోరాటాలు చేశారు. తమపై సాగుతున్న అన్నిరకాల దోపిడీ, పీడనలను ఎదిరించారు. అనేకసార్లు ఓటమి చెందినా తమ ఉనికే ప్రశ్నార్థకంగా మారుతున్న పరిస్థితులలో, తమ అస్తిత్వం కోసం అలుపెరుగని పోరాటాలు నేటికీ కొనసాగిస్తూనే ఉన్నారు.

జీవన పోరాటంలో ఆరితేరిన వారు ఆదివాసీలు. వారు నివసించే ప్రాంతాలు పుష్కలమైన సహజ వనరులతో కళకళలాడు తుండేవి. సాటి మానవులుగా అనేక దేశాలలో వారికి తగిన గుర్తింపు, రక్షణ లేదు. ఆయా దేశాలలో కనీసపు చట్టాలు, హక్కులు కూడా లేవు. నాగరిక సమాజపు కొత్త పోకడలకు దూరంగా తమ కట్టు, బొట్టూ, ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటు, తరతరాలుగా భావి తరాలకు అందిస్తున్నారు. యేడాది పొడవునా వారు జరుపుకునే పండుగలు, వేడుకల్లో వారి సంస్కృతి ప్రతిబింబిస్తుంది. ఆదివాసీలు ఒడిషా, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బీహార్, జార?ండ్, పశ్చిమ బెంగాల్, మిజోరం, అండమాన్ నికోబార్ దీవులలో ఎక్కువగా జీవిస్తున్నారు.

మన దేశంలో సుమారు 600 ఆదివాసీ తెగలు గుర్తించ బడ్డాయి. భారత రాజ్యాంగం వీరికి చట్టపరమైన రక్షణలు కల్పించింది. 1874లోనే ప్రత్యేక షెడ్యూల్డ్ జిల్లాల చట్టం చేయబడింది. 1917లో ఆదివాసీ తెగల నివాస ప్రాంతాలలో ఉమ్మడి భూమి హక్కులు ఇవ్వబడ్డాయి. ఆదివాసీ తెగలకు అటవీ భూములపై హక్కులు కల్పిస్తూ 2006లో చట్టం చేయబడింది. చట్టం ప్రకారం అటవీ భూమిపై ఆధారపడి జీవిస్తున్న ప్రతి గిరిజన కుటుంబానికీ 10 ఎకరాల వరకూ పట్టా ఇవ్వవచ్చు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు కావస్తున్నా ఆదివాసీ తెగలు తమ సంప్రదాయపు భూముల నుంచి, అటవీ ప్రాంతం నుంచి నెట్టివేయ బడుతున్నారు. అవిభక్త ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో 1/70 చట్టం అమలులో ఉన్నది.

గిరిజనుల సాంప్రదాయక భూములు గిరిజన తెగలకే దక్కాలి. గిరిజనేతరులకు షెడ్యూల్డ్ భూమిపై ఎట్టి హక్కూ లేదు. ఉభయ తెలుగు రాష్ట్రంలో షెడ్యూల్డ్ ప్రాంతంలో 48 శాతం సంప్రదాయక గిరిజన భూములను గిరిజనేతరులు ఆక్రమించు కున్నారు. ఆదివాసీ తెగల వాయిద్య



పరికరాలు, వారి నృత్యాలు ప్రభుత్వం ప్రోత్సాహం లేక అంతరించి పోతున్నాయి. ఆదివాసీ ప్రాంతాలలోకి పర్యాటకం ప్రవేశించాక ఆదివాసీ కళలు వ్యాపార సరుకులుగా మారి పోయాయి. స్వాతంత్ర్యం వచ్చి యేళ్లు గడుస్తున్నా అభివృద్ధికి నోచు కోని గిరిపల్లెలు నేటి ఉన్నాయి.

విద్య, వైద్య, రవాణా విషయంలో గిరిజన గూడాలు, తాండాల్లో నేటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నడవడానికి రోడ్డు, తాగటానికి నీటి సౌకర్యం కూడా లేని పల్లెలున్నాయి. ఇప్పటికి పోడు భూముల సమస్య, అటవీ భూములకు పట్టాలు, ప్రభుత్వ అజమాయిషీ కాకుండా గ్రామసభల ద్వారా స్వయం పాలన ఉద్దేశిత పీసా చట్టం అమలు కోసం గిరిజన ప్రాంతాల్లో ఆదివాసీ సంఘాలు పోరాటాలను కొనసాగిస్తూనే ఉన్నాయి. తెలంగాణలో కేసిఆర్ ప్రభుత్వం వీరి స్వయం పరిపాలనే లక్ష్యంగా ప్రత్యేక గ్రామ పంచాయతీలు ఏర్పాటుచేసి ప్రత్యేక నిధులు కేటాయించింది కూడా. పోడు భూముల విషయంలోనూ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నది. అలా గిరిజన అభివృద్ధికి ఇతోధిక సంక్షేమ కార్యక్రమాల అమలు అనివార్యం. అత్యవసరం.

# ఆక్రందన

తరతరాల అబలా విలాపం ఇది!
సాంకేతికత వల్ల ఎక్కువ వెలుగు
చూస్తున్నాయంతే...
'ఆమె'ను భోగవస్తువుగా ఖరారు చేసి
'యత్ర నార్యస్తు పూజ్యంతే...' అని పైపై
వచనాలు చెబితే సరిపోద్దా
ప్రేమ పేరుతో చేసే కామాయణం దాగుద్దా
చట్టాలు చేసి గొంతుకలు చించుకొని కొవ్వొత్తి
నివాళులర్పించినా మానభంగపర్వాలు, ప్రేమ
ముసుగు కామోన్మాద దౌష్ట్యాల కాష్టం ఆరదు!
నిర్థిష్ట లోపం సవరించే వరకు అంతే...
స్త్రీని అశ్లీలంగా చూపి సొమ్ము చేసుకొనే
మాధ్యమాల ధనదాహం, ప్రేమ పేరుతో
అందమైన కల్పనల భావజాలాలు ఆగాలి
యువతను నిర్వీర్యం చేసే పాశ్చాత్య
వ్యామోహాలు అభిరుచులు అలవాట్లు పోవాలి
సమాజం తరగతి గదిలో ఏది చెబితే అదే
ప్రజల్లో నాటుకుంటుంది?
ఉగ్గుపాలతో విషం కలిపి పిల్లాడు విషమై
పోయాడంటే ఎట్లా?
గంజాయి మొక్కలు నాటి కూర్చుంటే గంధపు
చెట్లెలా మొలుస్తాయి?
ఈ నిర్లక్ష్య, నిర్లజ్జ కాండని ఎగదోసింది ఎవరు
పురుషహంకార భావజాలం, పితృస్వామ్య
వ్యవస్థే కదా!
అబలపై చులకన ధోరణి అనాదిగా చొప్పిస్తున్న
విషవలయాల్ని కూకటి వేళ్ళతో పెకలించాలి
స్త్రీకి, మాతృస్థానాన్ని పరిపూర్ణమైన గౌరవాన్ని
ఇచ్చి యువతకు సద్బుద్ధి నేర్పి లోపాలు
దిద్దకపోతే ఇంకెందరు అభాగినుల కన్నీటి
రక్తంతో ఈ మట్టి తడవనుందో...!!

భీమవరపు పురుషోత్తమ్,
రాజమండ్రి, 9949800253

# విమానయాన భద్రతలోప్రభుత్వం రాజీపడదు

**బెదిరింపు కాల్స్ చేసే వారికి జీవిత ఖైదు**

**విమానయాన చట్టాల సవరణకు యత్నిస్తున్నాం**

**కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడి**



న్యూఢిల్లీ, (ప్రజామంటలు): విమానయాన భద్రతే ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యమని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. బెదిరింపులకు పాల్పడేవారిని నో ఫ్లై జాబితాలో చేర్చేలా చట్టాలను సవరిస్తున్నామని పేర్కొన్నారు. ఆయన సోమవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఇప్పటి వరకు వచ్చిన బెదిరింపులు మొత్తం బూటకమని తేలిందన్నారు. పౌర విమానయాన శాఖకు కఠినమైన ప్రొటోకాల్ ఉందని.. దానినే తమ శాఖ, విమానయాన సంస్థలు అనుసరిస్తోందని వివరించారు. ఇలాంటి బెదిరింపులు వచ్చిన సమయంలో పరిస్థితి చాలా సున్నితంగా ఉంటుందన్నారు. అంతర్జాతీయ విధివిధానాలను మనం అనుసరించాలని ఆయన వ్యాఖ్యానించారు. బెదిరింపు కాల్స్, సోషల్ మీడియా పోస్టులకు పాల్పడేవారికి జీవిత ఖైదు విధించేలా చట్టపరమైన మార్పులు తెచ్చేందుకు యత్నిస్తున్నామన్నారు. విమానంలో బోర్డింగ్ అయ్యాక బెదిరింపులకు పాల్పడే వారికి ఇటువంటి శిక్ష విధించేలా ఇప్పటికే చట్టంలో సెక్షన్లు ఉన్నాయి. కానీ, ఇతర ప్రాంతాల్లో ఉంటూ బెదిరింపులకు పాల్పడేవారికి కూడా వీటిని వర్తింపజేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. 1982 సేఫ్టీ ఆఫ్ సివిల్ ఏవియేషన్ చట్టాన్ని సవరించే అంశంపై వివిధ శాఖలతో కూడా చర్చిస్తున్నట్లు వివరించారు. 'గత వారం పలు విమానాలకు బెదిరింపులు రావడంతో వేరే మార్గాలకు మళ్లించాము. ప్రతి దానిని ప్రత్యేకంగా విశ్లేషించి వేగంగా, సమర్థవంతంగా చర్యలు తీసుకొన్నాం. అవి తప్పుడు బెదిరింపులైనా.. భద్రత, సురక్షిత విషయంలో రాజీ పడటంలేదు. ప్రయాణికుల ప్రాణాలే మాకు ముఖ్యం. అదే సమయంలో ఒక్క విమానాన్నైనా దారి మళ్లించాలనో, జాప్యం చేయాలనో మేము అనుకోవడం లేదు. హోంశాఖ, ఇతర ఏజెన్సీలతో కలిసి వీటిపై దర్యాప్తును వేగవంతం చేస్తున్నాం. రానున్న రోజుల్లో మెరుగైన పరిస్థితిని చూస్తాం' అని కేంద్ర మంత్రి చెప్పారు. శనివారం ఒక్కరోజే 30కి పైగా విమానాలకు బాంబు బెదిరింపులు రాగా.. ఆదివారం సైతం 24 విమానాలకు వచ్చాయి. ఇండిగో, విస్తారా, ఎయిరిండియా, ఆకాశ ఎయిర్‌తోపాటు పలు అంతర్జాతీయ సర్వీసు విమానాలు కూడా ఈ జాబితాలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. వీటిలో ఇండిగో, విస్తారా, ఎయిరిండియాకు చెందిన విమానాలు ఆరు చొప్పున ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ బెదిరింపుల గురించి సంబంధిత అధికారులకు తెలియజేశామని, వారి ఆదేశాల మేరకు భద్రతా విధానాలను పాటిస్తున్నామని విమానయాన సంస్థల ప్రతినిధులు వెల్లడించారు.

# ఆర్థిక ఇబ్బందుల్లో సమర్థ పనితీరు

## ప్రపంచానికి ఆశాకిరణంగా భారత్ - 'ది ఎన్డీటీవీ వరల్డ్ సమ్మిట్'లో మోడీ




న్యూఢిల్లీ, (ప్రజామంటలు): ప్రపంచం మొత్తం కొవిడ్, యుద్ధాలు, ఆర్థిక సంక్షోభాలతో ఇబ్బంది పడుతున్న వేళ కూడా మన దేశంలో 'భారత్ శతాబ్ది' గురించి ఆలోచిస్తున్నారని ప్రధాని మోదీ అన్నారు. ఆయన 'ది ఎన్డీటీవీ వరల్డ్ సమ్మిట్'లో ప్రారంభోపన్యాసం చేశారు. ప్రపంచానికి భారత్ ఆశాకిరణంలా కనిపిస్తోంద న్నారు. దేశం ప్రతి రంగంలో శరవేగంగా అభివృద్ధి చెందుతోందని అభివర్ణించారు. 'మా ప్రభుత్వం ఇప్పటికే 125 రోజులు పూర్తి చేసుకొంది. ఈ కాలంలో మా ప్రభుత్వ అనుభవాన్ని మీతో పంచుకుంటాను. పేదలకు 3 కోట్ల కొత్త పక్కా గృహాలు ఇచ్చాం. రూ.9 లక్షల కోట్ల ఇన్ఫ్రా ప్రాజెక్టులపై పని మొదలైంది. 15 వందేభారత్ రైళ్లు ప్రారంభించాం. 8 కొత్త ఎయిర్ పోర్టుల పనికి శ్రీకారం చుట్టాం. యువతకు రూ.2లక్షల కోట్ల రూపాయల ప్యాకేజీ ఇచ్చాం. రైతుల ఖాతాల్లో రూ.21 వేల కోట్లను బదిలీ చేశాం. 70 ఏళ్లు దాటిన వృద్ధులకు ఉచిత వైద్యానికి ఏర్పాట్లు చేశాం. 5 లక్షల ఇళ్లలో రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలు ఏర్పాటు చేశాం. స్టాక్‌మార్కెట్ సూచీల్లో దాదాపు 7 శాతం వృద్ధి నమోదైంది. విదేశీ మారకద్రవ్యం 700 బిలియన్ డాలర్లను దాటేసింది. నేను కేవలం 125 రోజుల్లో జరిగిందే చెబుతున్నాను. ఈ కాలంలో భారత్‌లో ప్రపంచం మూడు విషయాలు చర్చించడానికి వచ్చింది. టెలికామ్-డిజిటల్ ఫ్యూచర్‌పై అంతర్జాతీయ అసెంబ్లీ జరిగింది. గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్టివల్ నిర్వహించారు. గ్లోబల్ సెమీకండక్టర్ ఎకోసిస్టమ్‌పై సదస్సు జరిగింది. ఇవి భారత్ దిశ.. ప్రపంచం ఆశను తెలియజేస్తున్నాయి. ప్రపంచ భవిష్యత్తును భారత్ నిర్ణయిస్తుంది. మా ప్రభుత్వ మూడో విడత పాలనతో రేటింగ్ ఏజెన్సీలు దేశ వృద్ధిరేటును గణనీయంగా పెంచాయి' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. భారత్ వేగంగా వృద్ధి చెందుతున్న దేశమని ప్రధాని మోదీ అభివర్ణించారు. పేదల కష్టాలు తమకు బాగా తెలుసన్నారు. ఈ కార్యక్రమానికి ముందు ఆయన సదస్సులో పాల్గొనడానికి వచ్చిన విదేశీ అతిథులను కలుసుకొన్నారు. రెండ్రోజుల పాటు జరగనున్న ఈ సదస్సులో యూకే మాజీ ప్రధాని డేవిడ్ కామరూన్, భూటాన్ ప్రధాని దాసో త్సేరింగ్ టోబ్గే, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, భారతీ ఎయిర్‌టెల్ ఛైర్మన్ సునీల్ మిత్తల్ తదితరులు పాల్గొననున్నారు.

# బ్రెజిల్ అధ్యక్షుడికి తలకు గాయం బ్రిక్స్ సదస్సుకు దూరం



న్యూఢిల్లీ, (ప్రజామంటలు): బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డా సిల్వా తలకు గాయం కావడంతో బ్రిక్స్ సదస్సు కు వర్చువల్‌గా హాజరుకానున్నారు. శనివారం రాత్రి బాత్రూంలో జారిపడటంతో ఆయన తలకు గాయం అయ్యిందని అధికారులు తెలిపారు. వైద్యుల సూచన మేరకు రష్యాలో జరగనున్న బ్రిక్స్ సదస్సు కార్యక్రమానికి ఆయన నేరుగా హాజరు కాలేకపోతున్నారని.. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరవుతారని బ్రెజిల్ అధికారిక కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. మాస్కో అధ్యక్షతన రష్యాలోని కజన్ వేదికగా ఈ నెల 22 నుంచి 24 వరకు 16వ బ్రిక్స్(బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా) శిఖరాగ్ర సదస్సు జరగనుంది. ఈ సందర్భంగా బ్రిక్స్ సభ్య దేశాల అధినేతలతో భారత ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు నిర్వహిస్తారు. మోదీ రష్యా పర్యటన చేపట్టడం ఈ ఏడాదిలో ఇది రెండో సారి.

# రాజకీయ పబ్బం కోసం విమర్శలు !

తెలంగాణ, ఆంధ్రాలో విపక్షంలో ఉన్న బిఆర్ఎస్, వైకాపాలు తమది ..ఒక్కటే రాగం అన్న చందంగా విమర్శలతో కాలం గడుపుతున్నారు. అప్పుడే కొంపలు అంటుకు పోయాయని, తాము ఉంటే అంటుకునేవి కావన్న రీతిలో గగ్గోలు పెడుతున్నారు. విమర్శలకు హద్దులు ఉండవన్న రీతిలో రెండు పార్టీల నేతలు రోజూ ఏదో ఒక అంశం తీసుకుని పదేపదే విమర్శలు చేస్తున్నారు. ఎంతగా అంటే ఒకరోజు మీడియాతో మాట్లాడడం, మరుసటి రోజు దానినే ట్విట్టర్ ద్వారా వల్లించడం, తరవాతి రోజు దానిపై సొంత పత్రికల్లో కథనాలు రాయించడం అలవాటు చేసుకున్నారు. నవ్విపోదురు గాక నాకేంటన్న చందంగా ..గత పాపాలను ప్రజలు మరచి పోవాలన్న ఏకైక లక్ష్యంతో జంకూగొంకూ లేకుండా విమర్శలతో కాలం గడిపేస్తున్నారు. ఎపిలో జగన్, తెలంగాణలో కెటిఆర్, హరీష్ రావులు ఈ అబద్దాల ప్రచారంలో ఆరితేరారు. అధికారంలో ఉన్నప్పుడు వివిధ మార్గాల్లో సొంత ఆదాయం పెంచుకున్న వీరు ఇప్పుడు ప్రభుత్వంలో ఉన్న చంద్రబాబు ను, రేవంత్‌ను అడ్డగోలుగా దోచుకుంటున్నారని గగ్గోలు పెడుతున్నారు. అధికారమంటే దోచుకోవడమే అన్న చందంగా ఐదేళ్లు జగన్, పదేళ్లు బిఆర్ఎస్ నేతలు దోచుకున్నది ప్రజలు మరచి పోలేదు. ప్రభుత్వ వనరులను,ఖజానాను కొల్లగొట్టి తమ సొంత వనరులు సమకూర్చుకున్న నేతలుగా చరిత్రలో వీరు నిలిచి పోయారు. అసలు ఎపి విభజన జరిగిందే వీరి ఆదాయాలు పెంచడానికి అన్న చందంగా రాష్ట్రాల తీరు మారింది. అప్పులతో కుదేలు చేశారు. జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితికి తీసుకుని వచ్చారు. ఎపిలో లిక్కర్ పాలసీతో నాసిరకం మద్యం సరఫరా చేసిన జగన్ అడ్డంగా దోచుకున్నారు. నీతి, నిజాయితీ, విలువలు, విశ్వసనీయత వంటి మాటలు వల్లెవేస్తూ..గతమంతా బంగారు మయం చేశామని ఈ నేతలు చెప్పుకోవడం సిగ్గుచేటు. రాష్ట్ర ప్రయోజనాలను గాలికి వదిలేసిన వైకాపా, బిఆర్ఎస్ నేతలు ఇప్పుడు ప్రజలపై వల్లమాలిన ప్రేమను ఒలకబోస్తున్నారు. జర్నలిస్టులంటే అయ్యో అంటూ రాగాలు తీస్తున్నారు. ప్రజలను ఛీదరించుకునే స్థాయికి దిగజార్చి, వారిని కనీసం దరిచేరకుండా పాలన చేసి, సిఎం కలవాల్సిన అవసర మేముందని దబాయింపు మటలు మాట్లాడిని నేతలు ఇప్పుడు ప్రజలపై ఎక్కడ లేని ప్రేమను ఒలక బోస్తున్నారు. మల్లన్నసాగర్‌లో ప్రజల జీవితాను ముంచేసిన కెసిఆర్ బృందం ఇప్పుడు మూసీ మురికి బాధితుల కోసం మొసలి కన్నీరు కారుస్తున్నారు. దోచుకోవడమే పాలన అన్నచందంగా సాగిన వీరి ఆగడాలను భరించలేకే ప్రజలు అధికారం నుంచి దించేశారు. సంక్షేమం పేరిట ప్రజలకు డబ్బు పందేరాలు సాగించి, అదే అభివృద్ధి అని నమ్మించి ఎన్నికల్లో ఓటమి పాలైనా వీరికి జ్ఞానోదయం కలగడం లేదు. ఆనాడు దూరం పెట్టిన ప్రజలపై ఇప్పుడు ఎక్కడలేని మమకారం పుట్టుకొస్తోంది. ఓటమి ఎందుకు ఎదురైందో తెలుసుకునే ప్రయత్నం చేయకపోవడం ఆత్మవంచన చేసుకోవడం తప్ప మరోటి కాదు. ప్రతిపక్షంలో కూర్చోవడానికి కూడా సిద్ధంగా లేని నేతలు.. ముఖ్యమంత్రిగా మాత్రమే ఉండాలనుకుంటున్న నేతలను ప్రజలు సమయం చూసి వాతలు పెట్టారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్ష నేత చంద్రబాబు హైదరాబాద్‌లో నివసించడమేమిటని ప్రశ్నించిన జగన్ ఇప్పుడు తాను బెంగళూరులోని ప్యాలెస్‌లో ఎందుకు సేదదీరుతున్నారో చెప్పాలి. అలాగే అసెంబ్లీకి రాని, ప్రజల సమస్యలను పట్టించుకోని ఫామ్‌హౌజ్ కే పరిమితమైన కెసిఆర్ విపక్షనేతగా ఉండాలా అన్నది కూడా ప్రజలు ఆలోచించాలి. ఇలాంటి వారిలో పరివర్తన వస్తుందని, రావాలనుకోవడం అమాయకత్వమే అవుతుంది. అధికారంలో ఉన్నప్పుడు చెయ్యాల్సిన దురాగతాలన్నీ చేసి ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి, పత్రికా స్వేచ్ఛ గురించి, పోలీసుల వేధింపుల గురించి మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉంది. ఇది చాలదన్నట్లు ఇప్పటి కిప్పుడు ఎన్నికలు జరిగితే తమదే అధికారం అని బిఆర్ఎస్ తమ బాకా పత్రికలో కథనాలు రాయించు కుంటోంది. తెలంగాణలోమూసీ మురికి వదలకూడదు. అక్రమంగా రైతుబంధును అమలు చేసిన తీరును అడ్డుకోరాదు. అక్రమంగా బతుకమ్మ చీరల పేరుతో జరిగిన అన్యాయాలను నిలదీయరాదు. నిరుద్యోగులకు టోపీ పెట్టిన వైనాన్ని నిలదీయరాదు. మిష్ భగీరథ, మిషన్ కాకతీయ, కాళేశ్వరం, ధరణి అవినీతుల గురించి మాట్లారాదు.

నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన జరగాలని ఆకాక్షించి గ్రూప్ పరీక్షలు నిర్వహిస్తే వాటిని అడ్డుకోవడం అలవాటు చేసుకున్నారు. రెచ్చగొట్టి పబ్బం గడుపుకునే ముఠాలు తయారయ్యాయి. ఇదంతా చూస్తున్న తెలుగు ప్రజలు మాత్రం ఈ రెండు పార్టీలకు తగిన శాస్తి జరిగిందని సరిపెట్టుకుంటున్నారు. ప్రజలను కలవాల్సిన అవసరం సిఎంకు ఏమిటన్న కెటిఆర్ నిజాలు గ్రహించడం లేదు. హరీష్‌రావు కూడా ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారు. దుష్ట సంప్రదాయాలకు తలపడితే దాని పర్యవసానాలు ఇలాగే ఉంటాయి. మీడియాపై అక్కసు వెళ్లగక్కిన ఇరు రాష్ట్రాల పెద్దలు ఇప్పుడు మీడియాపై ప్రేమ ఒలక బోస్తున్నారు. ఎపిలో ఇప్పుడు పోలీసు కేసులు, వేధింపులు, పత్రికా స్వేచ్ఛ అంటూ జగన్ అండ్ కో గగ్గోలు పెట్టడం చూస్తే జాలేస్తోంది. అయితే గతంలో అధికారం అడ్డు పెట్టుకుని అక్రమాలకు పాల్పడి, అవినీతికి తెగించి, ఆర్థిక విధ్వంసం సృష్టించిన వారిపై చర్యలు ఉండాల్సిందే.

లేనిపక్షంలో అలాంటి వారిలో లెక్కలేనితనం పెరుగుతుంది. తమకేమీ కాదులే అన్న ధీమా రాజకీయ నేతల్లో రాకూడదు. జవాబుదారీతనం తీసుకుని రావాలి. ఇకపోతే గత పదేళ్లలో తెలంగాణను దోపిడీ చేశారని, కాళేశ్వరంను ఎటిఎంలా వాడుకున్నారని గగ్గోలు పెట్టిన బిజెపి నేతలు కూడా బిఆర్ఎస్ నేతలతో కలసి వంతపాడడం శోచనీయం. ఇద్దరు కేంద్రమంత్రులు తెలంగాణ అభివృద్ధి గురించి కాకుండా ప్రభుత్వం కాళ్లల్లో కట్టెల్లు పెడుతున్నారు. బిఆర్ఎస్ నేతలకు వంత పాడేలా విమర్శల చేస్తున్నారు. నిర్మాణాత్మక పాత్ర పోషించడలో వీరు విఫలం అయ్యారు. నరేంద్రమోడీ పాలనే బ్రహ్మాండంగా ఉందని ప్రచారం చేసుకుంటే సరిపోదు. ప్రజలు ఏమనుకుంటున్నారో ఈ ఇద్దరు కేంద్రమంత్రులు తెలుసుకుంటే మంచిది. క్షేత్రస్థాయిలో ప్రజల మనోభావాలను, వారు ఎదుర్కొంటున్న సమస్యలను బిజెపి చర్చించాలి. అలా చేసే ధైర్యం ఉందా అన్నది చెప్పాలి.

# ప్రజావాణి ఆర్జీలను పరిష్కరించుటలో జాప్యం ఉండకూడదు

## •జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్





జగిత్యాల అక్టోబర్ 21 (ప్రజా మంటలు) : ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఆర్జీలను ఆలస్యం కాకుండా వెంటవెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను అదనపు కలెక్టర్లు పి. రాంబాబు, గౌతమ్ రెడ్డిలతో కలసి కలెక్టర్ స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 46 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పి. రాంబాబు, గౌతమ్ రెడ్డి, మెట్ పల్లి ఆర్డీఓ శ్రీనివాస్, కలెక్టరేట్ ఏ.ఓ. హన్మంత రావు, వివిధ జిల్లా అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ధర్మపురి పోలీసు అమర వీరులకు ఘన నివాళులు

## నామమాత్ర సంస్మరణ కార్యక్రమాలు

(రామ కిష్టయ్య సంగన భట్ల)



ధర్మపురి అక్టోబర్ 21 ( ప్రజా మంటలు) : అవిభక్త కరీంనగర్ జిల్లా లోనే ప్రప్రథమంగా పోలీసు స్టేషన్ బయట ప్రజా సహకారంతో ధర్మపురి క్షేత్రంలో నిర్మించిన పోలీసు అమర వీరుల స్తూపం వద్ద సోమ వారం ధర్మపురి పోలీసుల ఆధ్వర్యంలో అమర వీరులకు నివాళు లు అర్పించారు. పీపుల్స్ వార్ ఉద్యమ చరిత్రలో అవిభక్త ఆంధ్ర రాష్ట్రంలోనే ప్రప్రథమంగా ధర్మపురి క్షేత్రం నుండి బొడ్డున సాయుధ ఎఆర్ కానిస్టేబుల్ కోమల్ రెడ్డిని హతమార్చడం జరిగింది.

ఈ నేపథ్యాన్ని దృష్టి యందుంచుకుని క్షేత్రంలో గత సి.ఐ. లు దామెర నర్సయ్య మరియు నల్ల మల్లారెడ్డిల చొరవ ఫలితంగా ఎస్ఐ కోటేశ్వర్ ఆధ్వర్యంలో, పోలీసు అమర వీరుల స్మృత్యర్థం 2005 సంవత్సరంలో స్థూపాన్ని నిర్మించగా, ప్రస్తుతం పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీసులు అమర వీరుల సంస్మరణ వారోత్సవాలలో ప్రధాన కార్యక్రమంగా, ధర్మపురి క్షేత్రంలో అమరవీరుల సంస్మరణ దినమైన సోమ వారం విధి నిర్వహణలో గతంలో అసువులు బాసిన పోలీసుల స్మృతి చిహ్నంగా నిర్మించిన స్థూపం వద్ద, అమర వీరులకు నివాళు లర్పించారు. దివంగత పోలీసులను స్మరిస్తూ ధర్మపురి సిఐ రాం నర్సింహా రెడ్డి నేతృత్వంలో, ఎస్ఐ మహేశ్ ఆధ్వర్యంలో ఎస్ ఐ లు శ్రీధర్ రెడ్డి బుగ్గారం, ఎస్ ఐ సతీశ్ గొల్లపెల్లి, సర్కిల్ లోని పోలీసులు స్మారక స్థూపం వద్ద లాంఛనాలతో పోలీసులు, నాయకులు శ్రద్ధాంజలి ఘటించారు. అమర వీరుల సంస్మరణ దినోత్సవ నేపథ్యాన్ని వివరించారు. అమర పోలీసుల ఆత్మశాంతికి మౌనం పాటించారు.

### నామమాత్ర సంస్మరణ కార్యక్రమాలు

విధి నిర్వహణలో తీవ్రవాదుల చేతులో, ఆసువులు బాసిన అమర పోలీసుల త్యాగాన్ని గుర్తుకు చేసుకుంటూ, వారి ఆత్మలకు శాంతిని చేకూర్చేందుకు నిర్దేశితమైన అమరుల పోలీసుల సంస్మరణ కార్యక్రమాలు ధర్మపురి క్షేత్రంలో నామమాత్రంగా, ప్రహసనంలా జరిగాయి. జిల్లాలోనే ప్రప్రథమంగా పోలీసు స్టేషన్ బయట ప్రజల విరాళాలతో, సహకారంతో నిర్మించిన పోలీసు అమర వీరుల స్థూపం వద్ద సోమవారం ధర్మపురి సర్కిల్ పరిధిలో విధి నిర్వహణలో ఆసువులు బాసిన పోలీసులు ఆత్మశాంతి కోసం ప్రార్థనలు జరిపి, సంస్మరణ సభ నిర్వహించాల్సి ఉండగా, ఈ కార్యక్రమాన్ని లాంఛన ప్రాయంగానే జరిపారు. సంవత్సరాలుగా ధర్మపురి స్టేషన్ ముందు ప్రజా సహకారం తో నిర్మించ బడిన అమర వీరుల స్తూపం వద్ద విద్యార్థుల, పోలీసుల ర్యాలీ నిర్వహిస్తూ... ప్రజా ప్రతినిధులు ఆహ్వానింప బడి, వారిచే ప్రసంగాలు ఏర్పాటు చేస్తుండగా, ఈ సారి కార్యక్రమాలను నిర్వహించే పోలీసులు, వాస్తవానికి అమర వీరుల సంస్మరణ దినాన్ని చిన్నచూపు చూశారు. పీపుల్స్ వార్ ఉద్యమ చరిత్రలో రాష్ట్రంలోనే ప్రప్రథమంగా ధర్మపురి క్షేత్ర నడిబొడ్డున సాయుధ ఎఆర్ కానిస్టేబుల్ కోమల్ రెడ్డిని హతమార్చిన సంఘటన రాష్ట్రవ్యాప్త సంచలనానికి హేతువైంది. ఈ నేపథ్యాన్ని పుర స్కరించుకుని, 2004 అక్టోబర్ లో అమర వీరుల వారోత్సవాల సందర్భంగా, ప్రజా ప్రతినిధులు, నాయకులు చేసిన సూచనలను అనుసరించి, క్షేత్రంలో పోలీసు అమర వీరుల స్మృత్యర్థం స్థూపాన్ని నిర్మించాలని నిర్ణయించారు. ఈ క్రమంలో పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీసు అమరవీరుల సంస్మరణ వారో త్సవాలను పు రస్కరించుకుని, ధర్మపురి క్షేత్రంలో, 2005 సంవత్సరంలో అమర వీరుల సంస్మరణ దినమైన ఆకోబర్ 21వ తేదీన, అమర పోలీసుల స్థూపాన్ని ఆవిష్కరించారు. క్షేత్రంలో ని, పోలీస్ స్టేషన్ ప్రహరీగోడ సమీపాన చౌరసా లో వాస్తవంగా 2004లోనే సూప నిర్మాణానికి శంకుసాపన జరిపారు. ఈ ప్రాంతంలో హింసలో అసువులు బాసిన పోలీసులు నిర్వహించిన స్థూప నిర్మాణ కార్యక్రమాన్ని నాటి సర్కిల్ ఇన్స్పెక్టర్ దామెర నర్సయ్య లాంఛనంగా ప్రారంభించగా, 2005లో సీఐ నల్ల మల్లా రెడ్డి చొరవతో, ఎస్ఐ కోటేశ్వర్, సిబ్బంది మిగిలిన పనులను పూర్తి గావించారు. రాష్ట్రం లోనే ప్రప్రథమంగా తీవ్రవాదులచే ధర్మపురి క్షేత్ర నడిబొడ్డున , బస్ స్టేషన్ సమీపాన, 1985 జూలై 23వ తేదీన పీపుల్స్ వార్ చే కాల్చి చంపబడిన సాయుధ కానిస్టేబుల్ చల్ల కోమల్ రెడ్డితో పాటు ధర్మపురి మండలంలోని నేరేళ్ళ మరియు సారంగాపూర్ మండలంలోని బట్ట పెల్లి, పోతారం మధ్య రోడుపై 1993 అక్టోబర్ 1వ తేదీన పీపుల్స్ వార్ తీవ్రవాదులు పేల్చిన మందు పాతరలో మృతి చెందిన సారంగాపూర్ స్టేషన్ కు చెందిన హెడ్ కానిస్టేబుల్ (శ్రీనివాస్ 1515), అదే స్టేషన్లో పని చేసిన శ్రీనివాస్ (పిసి 2290), జగి త్యాల టౌన్లో పనిచేసిన ప్రకాశ్ (పిసి 818) జగిత్యాల రూరల్ పోలీసు స్టేషన్లో పనిచేసిన రాజయ్య (పిసి176) ల సంస్మరణార్థం వారి పేర్లు చెక్కిన, ఫలకాన్ని ఏర్పాటు చేశారు. సదరు సంస్మరణ స్థూపాన్ని 2004లో నిర్మించ నిర్ణయించి, 2005లో పూర్తి చేసి, ప్రారంభించి, 2006 నుండి ఘనంగా సంస్మరణ సభ నిర్వహిస్తూ వస్తున్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో సంస్మరణ వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తూ వస్తూన్న క్రమంలో, ఆనవాయితీగా వస్తున్న కార్యక్రమాలను నిర్వహించడంపై అలసత్వం ప్రదర్శించడం తోటి పోలీసులకే మనో వేదన కలిగించింది. పోలీస్ సంస్మరణ దినం సందర్భంగా ప్రజల సహకారంతో నిర్మించిన స్థూపం వద్ద అమర పోలీసుల సంస్మరణ దినోత్సవాన్ని ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించడంలోనూ చూపిన అశ్రద్ధ, అలసత్వం ప్రజా ప్రతినిధులు, నాయకులు, ఒక్కరూ లేకుండా, జిల్లా కేంద్రంలో నిర్వహించే కార్యక్రమాలలో అధికారులు పాల్గొనాల్సి రావడం, తదితర కారణాంతరాల వల్ల చాలా త్వరగా కార్యక్రమాన్ని.ముగించి, నామమాత్రంగా స్థూపం వద్ద పుష్ప గుచ్చాలు ఉంచి, శ్రద్ధాంజలి ఘటించి కార్యక్రమం నిర్వహించామని పించడం పట్టణ ప్రజలకు బాధను మిగిల్చింది.





## గూడెం గుట్టపై స్వామిని దర్శించుకున్న అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి

దండేపల్లి అక్టోబర్ 21 (ప్రజా మంటలు) : మంచిర్యాల జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ డాక్టర్ బి నరేందర్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా గూడెం సత్యనారాయణ స్వామి, అయ్యప్ప సాయిబాబా ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నరేందర్ రెడ్డికి ఆలయ అధికారులు వేద పండితులు పూర్ణకుంభ స్వాగతం పలికి, శాలువా తో సత్కరించారు. అనంతరం తీర్థ ప్రసాదాలతో పాటు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు..

## తన పేరిట 20 లక్షలు బ్యాంకులో లోన్ తీసుకున్న వ్యక్తిపై చర్యలకు ప్రజావాణిలో ఫిర్యాదు



బుగ్గారం అక్టోబర్ 21 (ప్రజా మంటలు) మండలం మద్దునూరు గ్రామానికి చెందిన ముంజల నారాయణ (44) అనే వ్యక్తి క్రాప్ లోన్ నిమిత్తము జగిత్యాల పట్టణంలోని కెనరా బ్యాంకుకు వెళ్లగా ఊహించని విధంగా షాక్ తగిలింది. ఇదివరకే ఇతని పేరు మీద మరొకరు 20 లక్షల లోన్ తీసుకున్నారని బ్యాంకు అధికారులు తెలిపారు. విచారణ చేయగా ఆధార్ కార్డు లోని పేరు డేట్ ఆఫ్ బర్త్, తండ్రి పేరు, ఆధార్ కార్డు నెంబరు ఇతనిది ఉండగా, అడ్రస్ ఫోటో మాత్రము మరొకరి ఆధార్ కార్డు పెట్టి లోన్ తీసుకోన్నారని తేలింది. ఏం చేయాలో అర్థం అర్థం కాని పరిస్థితిలో, జగిత్యాల ప్రజావాణి లో ఫిర్యాదు చేసాడు. తరచూ బ్యాంకు నుండి లోన్ కట్టమని ఫోన్ లు రావడంతో మానసింగా కృంగిపోతున్నానని తెలుపుతూ వెంటనే తనకు న్యాయం చేయాలని తన పేరుపై ఎవరైతే లోన్ డబ్బులు 20 లక్షలు తీసుకున్నారో వారిని కఠినంగా శిక్షించాలని బాధితుడు కోరుతున్నాడు.

## గ్రీవెన్స్ డేలో ఫిర్యాదులను పరిశీలించిన ఎస్పీ అశోక్ కుమార్

### బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు ఆదేశం



జగిత్యాల అక్టోబర్ 21 (ప్రజా మంటలు) :ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో బాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులతో నేరుగా మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకొని, సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయా లని ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశించారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడడం జరుగుతోందని తెలిపారు.

## శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంకు విరాళం అందజేసిన దాతలు





కొడిమ్యాల అక్టోబర్ 21 ( ప్రజా మంటలు) : కొడిమ్యాల మండల కేంద్రంలో నిర్మాణం జరుగుతున్న శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానమునకు కొడిమ్యాల వాస్తవ్యులు సరిపెల్లి గంగారెడ్డి-కీ.శే: వరలక్ష్మిల రెండవ కుమారుడు సరిపెల్లి గంగాధర్ %-% సుజాత వీరి సంతానం కూతుర్లు : వర్ష, అక్షయ,అభినయల కుటుంబం, ఆలయనికి "శాశ్వత చందా దారులు" గా 25,116/- రూపాయలను ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయానికి ధన రూపేనా సహకరించిన దాతలకు అర్చకులు నాగరాజు రమేష్ స్వామివారి తీర్థ ప్రసాదములు అందజేసి మంగళ శాసనములతో ఆశీర్వదించారు. ఆలయ నిర్మాణానికి, అభివృద్ధికి సహకరించిన దాతల కుటుంబానికి ఆలయ నిర్మాణ కమిటీ, భక్తుల, గ్రామస్తుల తరఫున ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు.

# జనగామలో "అటకెక్కిన సాయం

## - ఆదుకున్న స్నేహం" లఘుచిత్రం చిత్రీకరణ





జనగామ అక్టోబర్ 21 (ప్రజామంటలు) : కల్చరల్ క్రియేటివ్ ఛానల్ జనగామ (సిసిసి జనగామ ఛానల్ ) యూట్యూబ్ ఛానల్ అధ్వర్యంలో జనగామ పరిసరాలలో "అటకెక్కిన సాయం ఆదుకున్న స్నేహం" అనే లఘుచిత్రం సోమవారం చిత్రీకరించారు. ప్రస్తుతం సమాజం మానవత దృక్పథంతో సహకారం అందిన వ్యక్తి అపద వస్తే సహకారం పొందినవారు సహకరించకపోవడం ఆ సమయంలో స్నేహితుడు ఆదుకున్న సందర్భంగాన్ని ఇతివృత్తంగా తీసుకుని లఘుచిత్రం నిర్మించారు. కల్నల్ డాక్టర్ మాచర్ల బిక్షపతి చివరలో అర్థవంతమైన సందేశాన్ని అందించారు. ఈ లఘుచిత్రంలో జి.కృష్ణ,అయిలా సోమ నర్సింహచారి, కొట్టె శ్రీలత, పొట్టబత్తిని శైలజ, రాగి ఈశ్వరమ్మ, బేబి శివాణి, గొలుసుల ఎల్లయ్య, అంబాల శ్రీనివాస్ గౌడ్, పొట్టబత్తిని భాస్కర్, పొగుల శ్రీనివాస్ నటించారు. నిర్మాత జి.కృష్ణ, అసిస్టెంట్ కెమెరా మెన్ శివరాత్రి రాజేష్ కథ, డిఒపి,దర్శకత్వం శ్రీకాంత్ నాయక్ సమకూర్చారు. ఈ సందర్భంగా కార్యక్రమ కార్యనిర్వాహకులు జి.కృష్ణ మాట్లాడుతూ ఈ లఘుచిత్రం నిర్మాణంలో జనగామ ప్రెస్టన్ ఇన్స్టిట్యూట్ కారస్పాండెంట్ డాక్టర్ బక్క ప్రవీణ్ కుమార్, ఎల్లంల ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. అతి త్వరలో లఘుచిత్రం యూట్యూబ్ ఛానెల్ విడుదల చేస్తామని, ప్రతి ఒక్కరు వీక్షించి, లైక్,షేర్,సబ్స్క్రైబ్, కామెంట్ చేయాలని జి.కృష్ణ కోరారు.

## జనగామ ప్రభుత్వ ఆసుపత్రిలో సిటీ స్కాన్ కోసం మోకాళ్లపై నిరసన తెలిపిన మంగళంపల్లి రాజు



జనగామ అక్టోబర్ 21 (ప్రజామంటలు): జనగామ జిల్లా ప్రధాన హాస్పటల్లో సిటీ స్కాన్ ఏర్పాటు చేయాలని గత 8సం,,లుగా జెఎసి రాజకీయ, ప్రజా సంఘాలు ఎన్ని వినతులు, నిరసనలు, ఆందోళనలు చేసిన ఇప్పటి వరకు ఎవరూ పట్టించుకోవడం లేదని, దాదాపు 5 మంది కలెక్టర్లు మారారు కానీ ఒక్కరూ కూడా ఏర్పాటు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు 100 కు పైగా వినతి పత్రాలు ఇచ్చామని, ఇప్పటికైనా చొరవ చూపాలని జనగామ కలెక్టర్ ముందు మోకాళ్లపై కూర్చొని సిటి స్కాన్ ఏర్పాటు చేయాలని జనగామ జెఎసి కన్వీనర్ మంగళంపల్లి రాజు ప్రాధేయపడ్డారు.




## ప్రజాస్వామ్య వేదిక ఆధ్వర్యంలో జీ ఎన్ సాయిబాబా సంస్మరణ సభ

కోరుట్ల అక్టోబర్ 21 (ప్రజా మంటలు) : చేయని తప్పుకు ప్రాణాలు కోల్పోయిన ప్రొపెసర్ జీ ఎన్ సాయిబాబా అని ప్రజాస్వామ్య వేదిక అధ్యక్షుడు చెన్న విశ్వనాథం అన్నారు. జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని సి. ప్రభాకర్ స్మారక భవన్ లో సోమవారం ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా ఆయన ఫోటో కు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చెన్న విశ్వనాథం మాట్లాడుతూ ఎలాంటి తప్పు లేకున్నా 10 సంవత్సరాలు జైలు జీవితం అనుభవించాడని అనంతరం నిర్దోషిగా విడుదల అయినా తర్వాత మరణించాడని ఆయన మరణంను ప్రభుత్వ హత్యగా వించాలన్నారు. ఆయన ఆదివాసీలకు అండగా ఉండి వారి హక్కుల కోసం పోరాడిన దీరుడనీ కొనియాడారు. ఈ కార్యక్రమంలో సి పీ ఏం జిల్లా కార్యదర్శి తిరుపతి నాయక్, చింత భూమేశ్వ ర్,, రాస భూమయ్య రాచకొండ దేవయ్య, ప్రజాస్వామ్య వేదిక సభ్యులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



కోరుట్ల అక్టోబర్ 21 (ప్రజా మంటలు) : జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో కాలేజ్ గ్రౌండ్ సమీపంలో ఒక గుర్తుతెలియని మగ వ్యక్తి అందాజా వయస్సు 40 సంవత్సరాలు గల మృతదేహం ఉంది. ఇట్టి వ్యక్తి మృతదేహం ప్రభుత్వ ఆసుపత్రి కోరుట్ల మార్చురీ గదిలో భద్రపరిచారు. ఇతనిని ఎవరైనా గుర్తుపట్టినచో కోరుట్ల ఎస్సై 8712656790, కోరుట్ల సీఐ 8712656820 సమాచారం అందించాలని కోరారు.



జగిత్యాల జిల్లా నర్సింగాపూర్ గ్రామం రహదారిపై ఎస్వీ ఎల్ అపార్ట్ మెంట్ ముందర రోడ్డు పై చాలా ఎత్తుగా వేసిన స్పీడ్ బ్రేకర్లు. గ్రామ ప్రజల పక్షాన స్పీడ్ బ్రీకర్లు తొలగించాలని కోరుతూ ప్రజావాణి లో దరఖాస్తు చేసిన నర్శింగాపూర్ గ్రామ యువకుడు.

## దూదేకుల కుల గణన అవకతవకలపై ప్రజావాణిలో ఫిర్యాదు

జగిత్యాల అక్టోబర్ 21 (ప్రజా మంటలు) : ప్రజావాణి లో కలెక్టర్ ని కలిసి గత ప్రభుత్వ హయంలో దూదేకుల కులగణన అవకతవకలపై అసలు జనాభా 16లక్షలు కాగా సమగ్రసర్వే లో తక్కువగా 3,44, 637హక్కులు హైజక్ చేయబడీ నాయి. మాన వీయ ప్రాతిపదికన హక్కులు పరి రక్షించాలని కోరుతు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నూరభాష / దూదేకుల సంఘం యూత్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.ఏ. ఆరీఫ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డి. నజీర్, జిల్లా ఉపాధ్యకులు ఎం.ఏ. సమియోద్దీన్, చంద్ పాషా, మొహమ్మద్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయుడిగా రాఘవాచారి అభినందించిన స్కూల్ యాజమాన్యం




హసన్ పర్తి అక్టోబర్ 21 (ప్రజా మంటలు) : మండల కేంద్రంలోని ఆక్సిలియం హైస్కూల్లో గణిత అధ్యాంకునిగా పనిచేస్తున్న రాఘవా చారి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. ప్రొఫెసర్ డాక్టర్ ఏ. అమృత రావు ఎడ్యుకేషనల్ సొసైటీ సహకారంతో ట్రస్మా (వడుప్స) హనుమకొండ జిల్లా ఆధ్వర్యంలో తెలంగాణ బెస్ట్ టీచర్ అవార్డు 2024 అవార్డ్స్ అందజేశారు. హనుమకొండ మిలీనియం కన్వెన్షన్ లో జరిగిన ఈ కార్యక్రమానికి ట్రస్మా రాష్ట్ర, జిల్లా బాధ్యులు పాల్గొన్నారు.

# విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

### అమరుల త్యాగాలు, ఆశయాల సాధన దిశగా ముందుకు సాగాలి

### -జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల అక్టోబర్ 21 (ప్రజా మంటలు) : విధి నిర్వహణలో, దేశ రక్షణ కోసం ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరుల సంస్మరణ పోలీస్ ఫ్లాగ్ డే ను జిల్లా లో ఘనంగా నిర్వహించారు. పోలీసు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన అమరవీరుల స్తూపం వద్ద జిల్లా కలెక్టర్, ఎస్పీ, పోలీస్ అధికారులు, అమరవీరుల కుటుంబ సభ్యులతో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ, పోలీసు వ్యవస్థ పటిష్టంగా ఉంటే అభివృద్ధి ప్రతి ఒక్కరికి చేరుతుంది అనడానికి మన రాష్ట్రమే నిదర్శనం. ఈ సమాజం కోరుకునేది శాంతి, స్థిరత్వం,అభివృద్ధి. పోలీస్ శాఖ వారి త్యాగాల ద్వారా ఎన్నో దశాబ్దాలుగా సమాజం లో ప్రతి ఒక్కరికి రక్షణ కల్పిస్తూ , సామాజిక రుగ్మతలను పారద్రోలడం వరకు పోలీసు వ్యవస్థ ఎల్లప్పుడూకార్యదీక్షతో ,సేవాతత్పరత తో పని చేస్తుందన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించి అమర వీరులైన పోలీసుల త్యాగాలు వెల కట్టలేనివి వారి త్యాగాలను గుర్తు చేసుకుంటూ ప్రభుత్వం క్రమం తప్పకుండా ప్రతి ఏటా అక్టోబరు 21న పోలీసు అమరవీరుల సంస్మరణార్థం పోలీస్ ఫ్లాగ్ డే ను ఘనంగా నిర్వహిస్తోంది. అమర వీరులు అయిన పోలీసుల యొక్క త్యాగాలను గుర్తు చేసుకుంటూ అక్టోబర్ 21 నుండి అక్టోబర్ 31వ వరకు సంస్మరణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. రాష్ట్ర డిజిపి ఆదేశాల మేరకు జిల్లాలో ఉన్న అన్ని పోలీసు స్టేషన్ల లో పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు, కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. ఇందులో భాగంగా ఆన్లైన్ లో ఓపెన్ హౌస్ కార్యక్రమాలు నిర్వహించి పోలీసు విధులు, సాంకేతిక వినియోగం, ప్రజారక్షణ లో పోలీసుల సేవలు , ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థ మొదలైన విషయాలను స్కూల్ పిల్లలకు తెలియజేయడం జరుగుతుంద న్నారు. విద్యార్థులకు ఆన్లైన్ నందు వ్యాసరచన పోటీలు, షార్ట్ ఫిలిమ్స్, ఫోటోగ్రఫీ, రక్తదాన శిబిరాలు,సైకిల్ ర్యాలి వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. అసాంఘిక శక్తులతో పోరాడుతూ కార్యనిర్వహణలో అమరులైన పోలీసు సిబ్బందికి పేరు పేరునా నివాళులర్పిస్తూ వారి కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ మనకు, మన సమాజానికి శాంతిని స్థిరత్వాన్ని అభివృద్ధిని అందించిన సోదరులకు మరో గుర్తు చేసుకుంటూ వారికీ జోహారులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ మాట్లాడుతూ... మనం ఈ యొక్క సొసైటీలో శాంతియుతంగా ప్రశాంతంగా జీవిస్తున్నామంటే దానికి





కారకులైనటువంటి బోర్డర్స్ లో పనిచేస్తున్నటువంటి సైనికులు గాని ,సొసైటీలో 24 గంటల పనిచేస్తున్నటువంటి పోలీసు వారే కారణం. పోలీసు అమరుల త్యాగం భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని చెప్పారు. ప్రజావసరాల కోసం, సంరక్షణ కోసం ఏర్పడ్డ వ్యవస్థ పోలీస్ వ్యవస్థ అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ తో పాటు దేశ అంతర్గత భద్రత ప్రజల రక్షణ, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ ఇలా ప్రతి సందర్భాల్లోనూ పోలీస్ వ్యవస్థ చాలా కీలకంగా పని చేస్తుందన్నారు. శాంతిభద్రతలు సక్రమంగా ఉంటే మారుమూల గ్రామాలకు కూడా అభివృద్ధి సాధ్యమవుతుందని కలెక్టర్ తెలిపారు. అక్టోబర్ 21 నుంచి అక్టోబర్ 31 వరకు ప్రజలకు పోలీసులు మరింత చేరువయ్యేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారని , ఇది అభినందనీయమని కలెక్టర్ అన్నారు. విధి నిర్వహణలో అమరులైనటువంటి వారికి వారి కుటుంబ సభ్యులకు సహాయ సహకారాలు అందిస్తూనే వారికి ఎల్లప్పుడూ సపోర్టుగా పోలీస్ ఆఫీసర్స్ కావచ్చు జిల్లా అడ్మిని స్ట్రేటివ్ ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో , నక్సల్స్ ఏరివేతలో భాగంగా జిల్లా లో అసువులు బాసిన వారిని మరోసారి గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ భీమ్ రావు , డిఎస్పి లు రవీంద్ర కుమార్, రఘు చంధర్, ఉమా మహేశ్వర రావు, రంగా రెడ్డి మరియు డి సి ఆర్ బి, సి సి ఎస్, ఐటి కోర్ ఇన్స్పెక్టర్ లు శ్రీనివాస్, , లక్ష్మీనారాయణ,రఫీక్ ఖాన్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు లు కిరణ్ కుమార్ రామకృష్ణ ,వేణు మరియు సి.ఐ లు వేణుగోపాల్,రామ్ నరసింహారెడ్డి,రవి,నిరంజన్ రెడ్డి, సురేష్ మరియు ఎస్.ఐ లు, పోలీస్ అమర వీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# గాంధీ ఆసుపత్రి లో నీటి కట కట

### ఇబ్బందులు పడ్డ పేషంట్లు, సహాయకులు

### మోటర్ కాలిపోవడంతో నీటి కష్టాలు

### రూ50 లక్షలతో 6 కొత్త మోటర్ల కొనుగోలు

సికింద్రాబాద్, అక్టోబర్ 21 (ప్రజామంటలు) : గాంధీ ఆసుపత్రిలో సోమవారం తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడింది. ఆసుపత్రి ఆవరణలోని నీటి సంపు వద్ద ఆసుపత్రి బిల్డింగ్ లపైకి నీటిని పంపింగ్ చేసే ఓ పంపుసెట్టు కాలిపోవడంతో నీటి సరఫరా నిలిచిపోయి, వాటర్ కష్టాలు తలెత్తాయి. వివరాలు ఇవి...ఆసుపత్రి పక్కనున్న ముషీరాబాద్ జలమండలి సెక్షన్ నుంచి నిత్యం గాంధీ ఆవరణలోని 7.2 లక్షల లీటర్ల కెపాసిటీ కలిగిన పెద్ద సంపు లోకి నీరు వస్తుంది. ఇక్కడి నుంచి ఆసుపత్రి మెయిన్ బిల్డింగ్(ఐపీ), ఓపీ బిల్డింగ్ తో పాటు ఇటీవల నూతనంగా నిర్మించిన ఎంసీహెచ్ బిల్డింగ్ లపైన ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకుల్లోకి నిత్యం 6లక్షల లీటర్ల నీటిని పంపింగ్ చేసి, అక్కడి నుంచి ఆసుపత్రి ఆయా వార్డులు, ఆపరేషన్ థియెటర్లు, తదితర ప్రదేశాలకు నీరు సరఫరా చేస్తారు. ఐపీ, ఓపీ బిల్డింగ్లపై ఆరుచొప్పున , ఎంసీహెచ్ బిల్డింగ్ పైన రెండు ఓవర్ హెడ్ ట్యాంకులున్నాయి. అయితే ఆదివారం సాయంత్రం ఉన్నట్టుండి ప్రధాన సంపు వద్ద ఉన్న ఓ పంపుసెట్టు కాలిపోయింది. దాంతో ఐపీ మెయిన్ బిల్డింగ్ లోకి నీటి సరఫరా నిలిచిపోయింది. దాంతో పేషంట్లు కొన్ని గంటల పాటు నీటి కోసం ఇబ్బంది పడ్డారు. క్రితం రోజు పంపింగ్ చేసిన ఓవర్ హెడ్ ట్యాంకుల్లోని నీటితో ఆపరేషన్ థియెటర్లకు ఇబ్బంది కలగలేదని వైద్యులు చెప్పారు. సర్జరీలు యదావిధిగా చేసినట్లు ఈఎన్టీ హెచ్ఓడీ ప్రొఫెసర్ జే.భూపేందర్ సింగ్ రాథోడ్ తెలిపారు. కాగా కొన్ని డిపార్ట్ మెంట్ ల్లో ఆపరేషన్ల నిర్వహణలో జాప్యం జరిగినట్లు



సమాచారం. సోమవారం మద్యాహ్నం సంపులో మరో పంపుసెట్టు భిగించి , నీటి సరఫరాను పునరుద్దరించడంతో నీటి సమస్య తీరిందని డిప్యూటీ సూపరింటెండెంట్ డా.సునీల్, ఆర్ఎంవో వన్ డాక్టర్ శేషాద్రి తెలిపారు.

**రూ 50 లక్షలతో ఆరు పంపుసెట్లు కొనుగోలు:**

కాగా గాంధీ ఆసుపత్రి ప్రారంభించిన మొదట్లో దాదాపు 23 ఏండ్ల క్రితం కొనుగోలు చేసిన 7.5 హెచ్ పీ కెపాసిటీ కలిగిన ఆరు పంపుసెట్లనే ఇప్పటికీ వాడుతున్నారు. ఇవి చెడిపోయినప్పుడల్లా రిపేర్లు చేయిస్తూ, వాటినే వాడుతూ వస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల తాజాగా రూ50 లక్షలతో ఆరు 15 హెచ్పీ కెపాసిటీ కలిగిన ఆరు పంపుసెట్లను కొనుగోలు చేసినట్లు టీజీఎమ్ఎస్ఐడీసీ ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. ఈ మోటర్లను ఉపయోగించి, గంటకు 2.5 లక్షల లీటర్ల నీటిని పంపింగ్ చేయవచ్చని తెలిపారు. కొత్త పంపుసెట్లు బిగింపు పనులు పూర్తి చేసుకొని, రెండు రోజుల్లో అందుబాటులోకి వస్తాయన్నారు.

## శాతవాహన వీసీ ని కలిసిన బీసీ నాయకులు



కరీంనగర్ అక్టోబర్ 21 (ప్రజామంటలు) : శాతవాహన విశ్వ విద్యాలయ నూతన వీసీ ఉమేష్ కుమార్ ని బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు , జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ లు మర్యాద పూర్వకంగా కలిశారు. సోమవారం శాతవాహన యూనివర్సిటీ నూతన వైస్ ఛాన్సలర్ గా బాధ్యతలు చేపట్టిన ఉమేష్ కుమార్ ను శాలువా కప్పి పూల బొకే ఇచ్చి మర్యాద పూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా వారు వీసీ తో మాట్లాడుతూ యూనివర్సిటీ పరిదిలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలు, బి.ఎడ్ మరియు ఎమ్.ఎడ్ కళాశాలలు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే జాబ్ ఓరియెంటెడ్ కోర్సు లు ఏర్పాటు చేయాలని కోరారు.

## నేషనల్ క్రైమ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడిగా జమీల్ అహ్మద్

కోరుట్ల అక్టోబర్ 21(ప్రజా మంటలు) :కోరుట్ల పట్టణానికి చెందిన జమీల్ అహ్మద్ ను నేషనల్ క్రైమ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడిగా నియ మించారు.ఆయన మాట్లాడుతూ తనను నియమించినందుకు ఆ సంస్థకు రుణపడి ఉంటానని అన్నారు. ఈ సందర్భంగా ఆయనకు నిర్మల్ జిల్లా కేంద్రంలో గెస్ట్ హౌస్ లో నేషనల్ క్రైమ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు షేక్ ఇమ్రాన్ చేతుల మీదుగా ఆయనకు నియామక పత్రాన్ని అందజేసినట్లు జమీల్ అహ్మద్ తెలిపారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ. జగిత్యాల జిల్లా అధ్యక్షుడిగా నియ మించడం పట్ల సంస్థకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.



## బెల్ట్ షాపులు తొలగించాలని కలెక్టర్ వినతి పత్రం

జనగామ అక్టోబర్ 21 (ప్రజామంటలు) : జనగామ పట్టణంలో బెల్ట్ షాపులు తొలగించాలని కలెక్టర్ కి వినతి పత్రం ఇచ్చారు. అనంతరం కెవిపిఎస్ పట్టణ కార్యదర్శి బొట్ల శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ జనగామ పట్టణంలో 30 వార్డులు ఉన్నాయి ఈ 30 వార్డులలో ప్రతి వార్డులో బెల్ట్ షాపులు అనేకంగా నిలిచాయి దాని కారణంగా మద్యానికి యువకులు, కుటుంబ యజమానులు బానిసలై కుటుంబాలను రోడ్డున పడేస్తున్న పరిస్థితి ఉన్నది. అలాగే ఆ ప్రాంతంలో మహిళలు ఆడపిల్లలు వీధుల వెంట వెళ్తుంటే తాగుబోతులు అనేక ఇబ్బందులు పెడుతున్నారు పట్టణ కేంద్రంలో వైన్ షాపులో టైం మెయింటైన్ చేస్తే వారి నుండి తెచ్చుకొని బెల్ట్ షాపులు నడుస్తున్న వారికి ఒక టైం లేకుండా 24 గంటలు మద్యం అందుబాటులో ఉంటుంది దీనివల్ల అనేకమంది ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఎక్సైజ్ శాఖ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన వారు పట్టించుకోవట్లేదు కాబట్టి తక్షణమే కలెక్టర్ స్పందించి పట్టణంలోని బెల్టు షాపులన్నీ మూయించాలని కోరారు.

## అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్డు పునర్నిర్మించాలి



జనగామ అక్టోబర్ 21 (ప్రజామంటలు) : అకాల వర్షాల వల్ల దెబ్బ తిన్న మున్సిపల్ రోడ్ లను త్వరగా పునర్నిర్మించాలని అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ అన్నారు. వర్షాల వల్ల దెబ్బతిన్న మున్సిపల్ రోడ్ లను సోమవారం అదనపు కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించి.. పునర్నిర్మానం అవుతున్న మున్సిపల్ రోడ్ల పనులన్నీ వారం లోగ పూర్తి కావాలన్నారు. 3 వ వార్డు లో కాలువ పూడిక తీత పనులను చూసి, చెత్త, చెదారం లేకుండా పూర్తి స్థాయిలో క్లీనింగ్ చేయాలన్నారు. 17 వ వార్డు లో మున్సిపల్ రోడ్ నిర్మాణ పనులను అదనపు కలెక్టర్ పరిశీలించి గుంతలు లేకుండా రోడ్ ల నిర్మాణం సరిగ్గా ఉండాలన్నారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు , ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

### గాంధీ ఆసుపత్రి ప్రొఫెసర్ కు రెండు గోల్డ్ మెడల్స్

### 3 రోజుల పాటు జరిగిన సౌత్ ఇండియా ఏవోఐ కాన్ఫరెన్స్




సికింద్రాబాద్, అక్టోబర్ 21 ( ప్రజామంటలు ) : గాంధీ ఆసుపత్రి ఈఎన్టీ హెచ్ఓడీ ప్రొఫెసర్ డా.జే. భూపేందర్ సింగ్ రాథోడ్ రెండు గోల్డ్ మెడల్స్ సాధించారు. హైదరాబాద్ శామీర్ పేట అలంకృతా రిసార్ట్ లో ఈనెల 18 నుంచి మూడు రోజుల పాటు జరిగిన 19వ సౌత్ ఇండియా, తెలంగాణ ఏవోఐ ( అసోసియేషన్ ఆఫ్ ఓటోలారింగోలాజిస్ట్స్ ఆఫ్ ఇండియా ) కాన్ఫరెన్స్ లో బెస్ట్ సర్జికల్ వీడియో ప్రజెంటేషన్, బెస్ట్ పేపర్ బై సీనియర్ టీచింగ్ ఫ్యాకల్టీ అనే రెండు విభాగాల్లో డా.రాథోడ్ ప్రతిభ కనబర్చి రెండు గోల్డ్ మెడల్స్ గెలుచుకున్నారు. ఈ కాన్ఫరెన్స్ లో తెలంగాణ తో పాటు ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలకు చెందిన వైద్య నిపుణులు పాల్గొన్నారు. ఈసందర్భంగా పలువురు డాక్టర్లు గాంధీ ఈఎన్టీ హెచ్ఓడీ ప్రొఫెసర్ డా.భూపేందర్ రాథోడ్ ను అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.

## ఎఇ పి .సుధాకర్, సన్మానం

జనగామ అక్టోబర్ 21 (ప్రజామంటలు) : ఎడిఇ అనికుమార్ సమక్షంలో నూతనంగా బదిలీ పై వచ్చేసిన ఎఇ పి .సుధాకర్, జాయినింగ్ అవుతున్న సమయంలో సన్మానించారు. ఇదివరకు పని చేసి బదిలీ పై వెలుతున్న ఏ.నర్సింహులు, నర్మెట్ట సేక్షన్ తరుపున సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్లు, ఓ%డ%యం సిబ్బంది నర్సింహారెడ్డి, రాజవర్ధన్ రెడ్డి, సుజాత, రాజు, శ్రీధర్,మంగ రాజయ్య, జన్ను స్వామి, భూక్య.బాలు నాయక్, కిష్టయ్య, కే.వేంకటయ్య, సురేష్, రాజేందర్, భాస్కర్, హేమంత్, మోహన్, రాజు, శ్రీకాంత్ జయంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రంలో ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పన

- దేశంలోనే తొలిసారిగా స్కిల్ డెవలప్‌మెంట్ ప్రణాళిక
- కేంద్రమంత్రితో మంత్రి లోకేశ్ భేటీ
- హడ్కో అధికారులతో మంత్రి నారాయణ చర్చలు








న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించేందుకు స్కిల్ డెవలప్మెంట్ ప్రణాళికలు, దేశంలోనే మొదటిసారిగా జరుగుతున్న స్కిల్ సెన్సస్‌కి సహకారం అందించాలని కేంద్ర మంత్రి, సెంట్రల్ స్కిల్ డెవలప్మెంట్ అండ్ ఆంతప్రెన్యూర్‌షిప్ అధికారులను ఏపీ ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేష్ కోరారు. ఢిల్లీలోని కౌశల్ భవన్‌లో స్కిల్ డెవలప్మెంట్ అండ్ ఆంతప్రెన్యూర్‌షిప్ శాఖ కేంద్రమంత్రి జయంత్ చౌధురి, సెక్రటరీ అతుల్ కుమార్ తివారీ, నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సీఈవో వేద్ మణి తివారీలతో ఏపీ మంత్రి నారా లోకేష్, ఉన్నతాధికారులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏపీలో చేపట్టనున్న స్కిల్ సెన్సస్‌పై మంత్రి లోకేష్ స్పెషల్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. స్కిల్ సెన్సస్ లక్ష్యం, ఎలా చేపడుతున్నారని కేంద్రమంత్రి ఆరా తీశారు. స్కిల్ సెన్సస్ పైలెట్ ప్రాజెక్టు పూర్తి కాగానే గుర్తించిన లోటుపాట్లు సరిచేసి రాష్ట్ర వ్యాప్తంగా చేపడతామని లోకేష్ వివరించారు. కూటమి ప్రభుత్వం ఐదేళ్లలో లక్షలాది ఉద్యోగాల కల్పనే ప్రధాన లక్ష్యంగా స్కిల్ డెవలప్మెంట్, స్కిల్ సెన్సస్ చేపట్టిందని మంత్రి తెలిపారు. స్కిల్ డెవలప్మెంట్ లక్ష్యం చేరుకునేందుకు కేంద్ర ప్రభుత్వం, నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్, మంత్రిత్వశాఖల నుంచి ఏపీకి ఏమేం కావాలో వివరిస్తూ ఓ లేఖను మంత్రి నారా లోకేష్ అందజేశారు. విజనరీ లీడర్ చంద్రబాబు నాయకత్వంలో నైపుణ్యం గల మానవవనరులను ఏపీ నుంచి అందించే లక్ష్యంగా పనిచేస్తున్నామని, దీని కోసం స్కిల్ డెవలప్మెంట్ కేంద్ర సంస్థలు ఏపీలో ఏర్పాటు చేయాలని కోరారు. పబ్లిక్-ప్రైవేటు పార్టనర్ షిప్ మోడల్‌లో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్కిల్స్ అమరావతిలో నెలకొల్పాలి. వారణాసి, హైదరాబాద్‌లలో విజయవంతంగా నడుస్తున్న మాదిరిగానే స్కిల్ ఇండియా ఇంటర్నేషన్ సెంటర్ ఇన్ అమరావతి కావాలి. గతంలోనే విశాఖపట్నంలో ఏడు ఎకరాలు కేటాయింపు జరిగిన చోట నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేయాలి. మంగళగిరిలో జెమ్స్ అండ్ జ్యూయలరీ , అమరావతిలో నిర్మాణరంగం, కర్నూలులో రెన్యువబుల్ ఎనర్జీ, చేనేత-హస్తకళలు, విశాఖలో ఫార్మా లాబ్స్, నెల్లూరు, తిరుపతిలో ఎలక్ట్రానిక్ సిస్టమ్ డిజైన్ మ్యానుఫ్యాక్చరింగ్ సెంటర్స్ ఆఫ్ ఎక్స్ లెన్స్ కేంద్రాలు నెలకొల్పేందుకు స్కిల్ కౌన్సిల్ సహకారం అందించాలన్నారు. నేషనల్ స్కిల్ డెలవప్మెంట్ వెబ్ సైట్లతో ఏపీ స్కిల్ డెవలప్మెంట్ అనుసంధానం చేయాలి. గిరిజనుల నైపుణ్య శిక్షణ కేంద్రాలు నెలకొల్పేందుకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించాలని అన్నారు. మంత్రి నారా లోకేష్‌తోపాటు పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, డైరెక్టర్ విజయరామరాజు, ఏపీ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎండీ, సీఈవో గణేష్ కుమార్, ఈడీ దినేష్‌కుమార్ పాల్గొన్నారు. మరోవైపు దిల్లీ పర్యటనలో ఉన్న మంత్రి నారాయణ కూడా హడ్కో అధికారులతో సమావేశమయ్యారు. ఈ భేటీలో మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఏకే సింఘాల్, హడ్కో సీఎండీ సంజయ్, హడ్కో విజయవాడ చీఫ్ మూర్తి పాల్గొన్నారు. అమరావతి నిర్మాణం, నెల్లూరులో అభివృద్ధి కార్యక్రమాలకు హడ్కో రుణంపై చర్చించారు. అమరావతి నిర్మాణంలో ప్రభుత్వ విధానాన్ని మంత్రి వివరించారు. అమరావతి నిర్మాణానికి సీఆర్‌డీఏకు రూ.11 వేల కోట్ల రుణం మంజూరు హడ్కో హామీ ఇచ్చింది. నెల్లూరులో అభివృద్ధి పనులకు రూ.165 కోట్ల రుణం విడుదల చేసేందుకు అంగీకారం తెలిపింది. వారం రోజుల్లో రుణ పక్రియ ప్రారంభిస్తామని వెల్లడించింది. కేంద్ర మంత్రి అమిత్‌షాను ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కలిశారు. ఏపీలో నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ క్యాంపస్ ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. విశాఖ లేదా అమరావతిలో ఎన్ఎఫ్ఎస్‌యూ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. బుడగ జంగాలకు సంక్షేమం, విద్య, ఉపాధి, సామాజిక, ఆర్థిక అవసరాలకు సమగ్ర విధానం తయారు చేయాలని కోరారు. ఎంపీ విజ్ఞప్తికి అమిత్‌షా సానుకూలంగా స్పందించారు.



# గ్రూప్ -1 పరీక్షలకు బందోబస్తు

## విపక్ష బిఆర్ఎస్ నేతల గృహనిర్బంధం

హైదరాబాద్,అక్టోబర్21 (ప్రజా మంటలు): గ్రూప్ 1 పరీక్షలు సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం కానున్న నేపథ్యంలో విపక్ష బీఆర్ఎస్ నేతలను పోలీసులు హౌజ్ అరెస్ట్ చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాసం వద్ద పోలీసులు పహారా కాసారు. బంజారాహిల్స్ నందినగర్‌లోని కేటీఆర్ ఇంటి వద్ద పోలీసులు భారీగా మోహరించారు. వందల సంఖ్యలో పోలీసులను మోహరించి, పదుల పోలీసు వాహనాలను ఉంచారు. నందినగర్ ప్రాంతమంతా పోలీసు బలగాలతో నిండిపోయింది.గ్రూప్-1 మెయిన్స్ వాయిదా వేయాలని కోరుతున్న అభ్యర్థుల తరఫున విపక్షాలు నిరసనలు చేస్తున్న విషయం తెలిసిందే. కాసేపట్లో పరీక్ష ప్రారంభం కాబోతున్నందనా.. రాజకీయ నిరసనలు జరగి, పరీక్షలకు ఇబ్బందులు కలగకుండా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. కేటీఆర్ తోపాటు బీఆర్ఎస్ సీనియర్ నేతలు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి తదితరుల ఇళ్ల బయట గస్తీ కాస్తున్నారు.



# శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల కీలక పాత్ర

**ప్రజల మాన, ప్రాణ, ఆస్తులకు రక్షణగా నిలుస్తున్నారు**

**విధి నిర్వహణలో ఎంతోమంది ప్రాణాలు విడిచారు**

**అమరావతితోల శాశ్వత స్మారక స్థూపం ఏర్పాటు**

**పోలీస్ అమరులకు నివాళి అర్పించిన సిఎం చంద్రబాబు**





అమరావతి,అక్టోబర్21(ప్రజా మంటలు): శాంతి భద్రతల పరిరక్షణకు ఏపీ పోలీసులు అహర్నిశలు కృషి చేస్తున్నారని, ప్రజల మాన, ప్రాణ, ఆస్తులకు రక్షణగా నిలుస్తున్నారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్ర విభజన అనంతరం ఏపీ పోలీసు వ్యవస్థలో అనేక మార్పులు తీసుకువచ్చినట్లు ఆయన చెప్పారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం విజయవాడలో అమరవీరుల స్థూపానికి సీఎం చంద్రబాబు ఘన నివాళులు అర్పించారు. ముందుగా ముఖ్యమంత్రితోపాటు హోంమంత్రి వంగలపూడి అనిత, ఏపీ డీజీపీ ద్వారక తిరుమలరావు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. విధి నిర్వహణలో చాలా మంది పోలీసులు ప్రాణాలు విడిచి ప్రజల హృదయాల్లో త్యాగధనులుగా నిలిచారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. అన్నింటికంటే పోలీసు శాఖ అత్యంత కీలకమని చెప్పారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. 'ఏ ప్రగతి జరగాలన్నా పోలీసులే కీలకం. ప్రజల ప్రాణాలు, ఆస్తులు కాపాడేందుకు రాత్రింబవళ్లు కష్టపడుతున్నారు. అహర్నిశలు శ్రమిస్తున్న పోలీసులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. ఉమ్మడి రాష్ట్రంలో నక్సలిజాన్ని ఉక్కుపాదంతో అణచివేశారు. ఫ్యాక్షనిజం, రౌడీల ఆట కట్టించారు. శాంతిభద్రతలను కాపాడటంలో ఏమాత్రం రాజీలేదు. పోలీసుల సంక్షేమం మా ప్రభుత్వం బాధ్యత. పటిష్ఠ యంత్రాంగంగా తయారు చేయడం మా కర్తవ్యం. రాష్ట్ర విభజన తర్వాత పోలీసు వ్యవస్థలో అనేక మార్పులు తీసుకొచ్చాం. వాహనాలతో పాటు పరికరాలు, సాంకేతిక సౌకర్యం కల్పించాం. ఏపీ పోలీసు అంటే దేశంలోనే మోడల్‌గా తీర్చిదిద్దాలని ముందుకెళ్లాం. 2014-2019 మధ్య రూ.600 కోట్లు ఖర్చు చేశాం. కొత్తగా వాహనాల కోసం రూ.150కోట్లు వెచ్చించాం. పోలీసు కార్యాలయాల మరమ్మతులు, నిర్వహణకు రూ.60కోట్లు ఖర్చుపెట్టాం. రూ.27కోట్లతో ఏపీఎఫ్ఎస్ఎల్ ఎక్విప్‌మెంట్ కొనుగోలు చేశాం. పోలీసు సంక్షేమానికి రూ.55 కోట్లు కేటాయించాం. సర్వే రాళ్లపై బొమ్మలకు తగలేసి.. సీసీ కెమెరాలకు రూ.700కోట్లు ఇవ్వలేకపోయారు..సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు దీటైన పోలీసు వ్యవస్థకు శ్రీకారం చుట్టాం. విశాఖపట్నంలో గ్రేహౌండ్స్ కోసం ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేశాం. కేంద్రం ఎప్పటికప్పుడు పోలీసు వ్యవస్థ ప్రక్షాళనకు ముందుకొస్తోంది. ఆధునిక ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అధికారంలోకి వచ్చిన 125 రోజుల్లో పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నీ చెల్లించాం. దిశ పేరుతో వాహనాలకు రూ.16కోట్లు, కమ్యూనికేషన్ పరికరాల కోసం రూ.20కోట్లు పెండింగ్ పెడితే వాటినీ చెల్లించాం. తప్పు చేసిన వ్యక్తిని వెంటనే పట్టుకునే వ్యవస్థ అవసరం. గత ప్రభుత్వం కక్ష సాధింపులే పనిగా పెట్టుకుంది. రాగద్వేషాలకు అతీతంగా పనిచేసేదే పోలీసు వ్యవస్థ. సర్వే రాళ్లపై బొమ్మ కోసం రూ.700 కోట్లు తగలేసిన వ్యక్తి జగన్. సీసీ కెమెరాల కోసం మాత్రం రూ.700 కోట్లు ఇవ్వలేకపోయారు. నేరాల తీరు మారుతోంది.. పోలీసు వ్యవస్థ అప్రమత్తంగా ఉండాలి. రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడేవారిని కఠినంగా శిక్షించాలి' అని చంద్రబాబు సూచించారు. దేశ రక్షణలో ప్రాణాలు అర్పించిన పోలీసులకు నివాళులు అర్పిస్తున్నా. శాంతిభద్రతల కోసం వారు అహర్నిశలు కృషి చేస్తున్నారు. సంఘ విద్రోహ శక్తులపై పోరాడిన ఉమేశ్ చంద్ర, వేదవ్యాస్ లాంటి పోలీసులు ఎందరో ప్రాణాలు కోల్పోయారు. అలాంటి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుంది. వారి స్ఫూర్తి ప్రతి పోలీసులో ఉంది. దేశానికి, రాష్ట్రానికి ఈ శాఖ చాలా కీలకం. రాత్రి, పగలు తేడా లేకుండా పని చేస్తారు. పోలీసు ఉద్యోగం సవాళ్లతో కూడుకుంది. 24 గంటలూ పని చేసే ఏకైక శాఖ పోలీసు శాఖ. వారికి పండగలు ఉండవు, ఎప్పుడూ విధుల్లోనే ఉంటారు. తిరుమల బ్రహ్మోత్సవాలు, దుర్గమాత ఉత్సవాలు, విజయవాడ విపత్తులో పోలీసుల పాత్ర అభినందనీయం. భారతదేశంలోనే ఏపీ పోలీసు వ్యవస్థ ఒక బ్రాండ్ అయిపోయిందన్నారు. ఆడబిడ్డలపై అత్యాచారాలు చేస్తున్నారు. ప్రతి కేసును సవాల్‌గా తీసుకుంటాం.. ఛేదిస్తాం. ఆడబిడ్డలు ట్రాప్‌లో పడొద్దు. నేరస్థులకు చట్టపరమైన శిక్షపడేలా ప్రభుత్వం చర్య తీసుకుంటుంది. పిల్లలను తల్లిదండ్రులు కంట్రోల్ చేయాలి. హిందూపూర్ గ్యాంగ్ రేప్, కడపలో యువతి హత్య కేసులో నేరస్థులకు కఠిన శిక్షలు పడే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది . ఆడబిడ్డల రక్షణే ప్రభుత్వ లక్ష్యం. రానున్న రోజుల్లో కానిస్టేబుల్ నియామకాలు చేపడతాం. ప్రతి ఏటా రూ.20 కోట్లు పోలీసు శాఖకు అందిస్తాం. రానున్న రోజుల్లో అమరావతిలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినం జరుపుకుందాం. అమరావతిలో శాశ్వత అమరవీరుల సంస్మరణ స్థూపం ఏర్పాటు చేస్తానని అన్నారు. రాయలసీమ ఫ్యాక్షనిజం, విజయవాడ రౌడీయిజం అణచివేసిందే పోలీసులే. ఇకపై రాష్ట్రంలో జీరో క్రైమ్ నమోదు కావాలి. శాంతి, భద్రతలు మొదటి ప్రాధాన్యతగా పనిచేయాలి. ఎవరైనా నేరం చేయాలనే ఆలోచన వస్తేనే భయపడాలి. పోలీసు వ్యవస్థలో అనేక మార్పులు తీసుకువచ్చాం. వారికి కావాల్సిన సదుపాయాలు అన్నీ సమకూర్చాం. వారి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. సవాళ్లను ఎదుర్కొనేందుకు సమర్థవంతమైన వ్యవస్థను ఏర్పాటు చేశాం. నేను మొదట్నుంచీ పోలీసు వ్యవస్థపై ప్రత్యేక దృష్టి పెట్టా. సాంకేతిక పరిజ్ఞానాన్ని పోలీసులకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. నేరస్థులు లేటెస్ట్ టెక్నాలజీ వాడుతుంటే పోలీసులు పాత టెక్నాలజీ వాడుతున్నారు. ప్రభుత్వం పోలీస్ వ్యవస్థపై దృష్టి పెడుతోంది. ఇకపై టెక్నాలజీ పరిజ్ఞానం అందిస్తాం. ఆధునిక పరికరాలు సమకూరుస్తాం అన్నారు. నేటి సమాజంలో నేరాల తీరు మారుతోంది. నేరస్థుల కంటే పోలీసులు ఎక్కువ టెక్నాలజీ కలిగి ఉంటేనే వారిని కట్టడి చేయగలం. రాజకీయ నాయకుల ముసుగులో కొంతమంది నేరాలకు పాల్పడుతున్నారు. వారి రాజకీయ ముసుగు తీసి నేరాలు అరికట్టే బాధ్యత పోలీసులు తీసుకోవాలి. మీకు అండగా ప్రభుత్వం ఉంటుంది. భావితరాల కోసం నేను గతంలోనే టెక్నాలజీ తీసుకువచ్చాను. రియల్ టైమ్ మానిటరింగ్ చేయగలిగితే నేరాలు నియంత్రించవచ్చు. మూడో నేత్రానికి నాలుగో నేస్తం సాంకేతిక పరిజ్ఞానం. రౌడీలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తే అదే వారికి చివరిరోజు. డ్రగ్స్, గంజాయి, ఎర్రచందనం స్మగ్లింగ్‌కు అడ్డుకట్ట వేస్తాం. గత ప్రభుత్వ పెండింగ్ నిధులు విడుదల చేశాం. నేను కోరుకునేది విజుబుల్ పోలీసింగ్... ఇన్విజిబుల్ పోలీసింగ్. రాజకీయ వేధింపులకు పోలీసులను వైసీపీ ప్రభుత్వం వాడుకుంది. రూ.12 కోట్లతో కంచే ఏర్పాటు చేసుకున్నాడు గత ముఖ్యమంత్రి. మాజీ సీఎం జగన్ సర్వే రాళ్లపై రూ.700 కోట్లు వృథా ఖర్చు చేశారు. గత ప్రభుత్వం పోలీసులకు సరెండర్ లీవ్స్ కూడా ఇవ్వకపోవడం బాధాకరం. వారు చేసిన అప్పులు తీర్చే బాధ్యత ఎన్డీయే ప్రభుత్వంపై పడిందని బాబు చెప్పారు.

DIGITALLY PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AT 6-3-144, bRAHMAN WADA, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL 2021/81092
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com